


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 11-02-2026 | సంపుటి - 26 | సంచిక -263 | రూ : 4 | పేజీలు: 8



హైదరాబాద్ శివారులో భూప్రకంపనలు..


## బయటకు పరుగుతీసిన ప్రజలు

- ఉదయం 10:10 గంటలకు కంపించిన భూమి
- భూప్రకంపనలా లేక పేలుడు జరిగి కంపించిందా అనేదానిపై అస్పష్టత
- సంఘటన స్థలానికి చేరుకున్న సంబంధిత అధికారులు

2లో







2లో

# పట్నమా.. ఓటెయ్యి

- ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో నేడు పోలింగ్.. ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు ఓటింగ్
- రీపోలింగ్ అవసరమైతే రేపు నిర్వహణ
- మక్తల్ ఆరో వార్డు ఎన్నిక వాయిదా
- 13న లెక్కింపు.. 16న మేయర్, ఛైర్‌పర్సన్ల ఎన్నిక

## మున్సిపల్ ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు

- * ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదంపై అసత్య ప్రచారం నమ్మొద్దు
- * డీజీపీ శివధర్‌రెడ్డి

2లో




ప్రభుత్వ ఉద్యోగులకు త్వరలో

## కొత్త ఆరోగ్య పథకం

- బేసిక్‌లో 1.5% చెల్లించేలా మార్గదర్శకాలు!
- రేపు కీలక భేటీ

2లో



'ఏఐ' కంటెంట్ దుర్వినియోగంపై

## సోషల్ మీడియాకు కేంద్రం కీలక ఆదేశాలు

చట్టవిరుద్ధమైన అంశాలను నిరోధించడానికి ఆటోమేటెడ్ సాధనాలు ఉండాలన్న కేంద్రం

2లో

కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ఫోన్ ట్యాపింగ్..

## బాంబు పేల్చిన మంత్రి పొంగులేటి

- బాధ్యులపై ఉక్కుపాదం తప్పదన్న మంత్రి

2లో





## వాయుసేనకు 114 కొత్త రఫేల్స్..

### రూ.3.25 లక్షల కోట్ల మెగా డీల్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్!

- భారత వాయుసేన కోసం 114 రఫేల్ జెట్ల కొనుగోలుకు రంగం సిద్ధం
- రూ.3.25 లక్షల కోట్ల విలువైన ఈ ఒప్పందానికి త్వరలో రక్షణ శాఖ ఆమోదం
- ఒప్పందంలో భాగంగా సుమారు 100 యుద్ధ విమానాల దేశీయ తయారీ

2లో

## సీఎం సొంత జిల్లాలోనే నీటి కష్టాలు..

### గుంటనక్కకు, రేవంత్‌కి మధ్య ఉన్న సంబంధం ఏంటి?



2లో

- మహబూబ్‌నగర్‌లో రెండు మూడు రోజులకోసారి నీళ్లు
- మున్సిపాలిటీల్లో గుట్టలుగా చెత్త
- సిద్ధిపేటకే నిధులు ఎందుకు?
- మిగితా మున్సిపాలిటీల మాటేంటి?
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఫైర్

# ‘ఏఐ’ కంటెంట్ దుర్వినియోగంపై
## సోషల్ మీడియాకు కేంద్రం కీలక ఆదేశాలు

ఢిల్లీ: కృత్రిమ మేధస్సు (ఏఐ) ద్వారా రూపొందించే కంటెంట్‌ను గుర్తించడానికి, నియంత్రించడానికి వ్యవస్థలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు ఆదేశాలు జారీ చేసింది. చట్టవిరుద్ధమైన, అసభ్యకరమైన, తప్పుదారి పట్టించే విషయాలను నిరోధించడానికి ఆటోమేటెడ్ సాధనాలను అందుబాటులోకి తేవాలని సూచించింది. కృత్రిమ మేధస్సుతో రూపొందించిన కంటెంట్ కొత్త సవాళ్లు విసురుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఏఐ జనరేటెడ్ కంటెంట్‌కు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు తప్పనిసరిగా లేబుల్ వేయాలని ఆదేశించింది. కంటెంట్‌ను అందరు సులువుగా గుర్తించేలా ఆ లేబుల్ ఉండాలని స్పష్టం చేసింది. ఒకసారి దీనిని అప్లై చేశాక లేబుల్‌ను గానీ మెటా డేటాను గానీ తొలగించడానికి లేదా కనబడకుండా చేయడానికి వీలులేకుండా ఉండాలని పేర్కొంది. ఏఐ కంటెంట్‌ను దుర్వినియోగం చేస్తే పడే పెనాల్టీలు, శిక్షల గురించి వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి యూజర్‌కు సందేశాలు పంపించాలని ఆదేశాల్లో పేర్కొంది. ఏఐ జనరేటెడ్ లేదా డీప్ ఫేక్ కంటెంటును తొలగించాలని ప్రభుత్వం లేదా కోర్టులు ఆదేశించినప్పుడు దానిని మూడు గంటల్లోనే తొలగించాలని స్పష్టం చేసింది.

# పేట్నమా.. ఓటెయ్యి

హైదరాబాద్ : రాష్ట్రంలో ‘పుర’పోరుకు రంగం సిద్ధమైంది. ఏడు నగరపాలక సంస్థల్లోని 412 డివిజన్లు, 116 పురపాలక సంఘాల్లోని 2,569 వార్డుల్లో బుధవారం ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. రీపోలింగ్ అవసరమైతే 12న నిర్వహిస్తారు. అన్ని పోలింగ్ కేంద్రాల లోపల, బయట వెబ్‌కాస్టింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. పోలింగ్ జరిగే ప్రాంతాల్లో బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొంది. ఓట్ల లెక్కింపు 13న జరుగుతుంది. 16న కార్పొరేషన్ల మేయర్లు, ఉపమేయర్లు, మున్సిపాలిటీల ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్ల పదవులకు పరోక్ష ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం ఏడు నగరపాలక సంస్థల్లోని 414 డివిజన్లకు, 116 పురపాలికల్లోని 2,582 వార్డులను ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. ఇందులో రెండు డివిజన్లు, 12 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మక్తల్‌లోని ఆరో వార్డు భాజపా అభ్యర్థి మృతి వల్ల అక్కడ ఎన్నిక వాయిదా పడింది. మిగిలిన 412 డివిజన్లు, 2,569 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 12,944 మంది బరిలో ఉన్నారు. 16,382 బ్యాలెట్ బాక్సులను ఉపయోగించనున్నారు. 1,379 మంది రిటర్నింగ్ అధికారులు, 41,773 మంది సిబ్బంది విధుల్లో పాల్గొననున్నారు. కార్పొరేషన్ల వారీగా చూస్తే 412 డివిజన్లలో 2,225 మంది పోటీ చేస్తున్నారు. ఇందులో కాంగ్రెస్ 410, భారాస 401, భాజపా నుంచి 382 మంది ఉన్నారు. 2,174 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అత్యధికంగా కరీంనగర్‌లో 66 డివిజన్లకు 398 మంది పోటీ పడుతున్నారు. పురపాలికల వారీగా చూస్తే మొత్తం 2,569 వార్డులలో 10,719 మంది పోటీ చేస్తున్నారు. ఇందులో కాంగ్రెస్ నుంచి 2,538, భారాస 2,478, భాజపా నుంచి 2,252 మంది బరిలో ఉన్నారు. 6,017 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్‌లో అత్యధికంగా 49 వార్డులకు 314 మంది పోటీ చేస్తున్నారు.

**ఓటర్ స్లిప్పుల పంపిణీ**

ఎన్నికల కోసం డివిజన్లు, వార్డుల వారీగా ఫొటో ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయింది. ఎన్నికల సంఘం రూపొందించిన టీపోల్ యాప్‌లోకి వెళ్లి ఓటర్ గుర్తింపు కార్డు (ఎపిక్) నంబరు సాయంతో స్లిప్పులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పోలింగ్ కేంద్రాన్ని గుర్తించడానికి దీనిని ఉపయోగించవచ్చు. ఓటర్ల సహాయం కోసం 92400 21456 నంబరుతో కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని కోరారు. స్థానిక పాలనను బలోపేతం చేయడంలో ప్రతి ఓటు కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అధికారులు ఇంటింటికి పంపిణీ చేసిన ఓటరు స్లిప్పులతోపాటు ఏదైనా ఆమోదిత గుర్తింపు కార్డుతో ఓటు వేయవచ్చని చెప్పారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు త్వరలో కొత్త ఆరోగ్య పథకం

హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులకు త్వరలో కొత్త ఆరోగ్య పథకం అమల్లోకి రానుంది. ఈ మేరకు గురువారం (12వ తేదీ) మధ్యాహ్నం 3 గంటలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నేతృత్వంలో ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో ఇతర ఉన్నతాధికారులు, పలు ఉద్యోగ సంఘాలతో సచివాలయంలో కీలక సమావేశం నిర్వహించనున్నారు. పాత పథకంలో ఉన్న పలు లోపాలను సవరించి కొత్త పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టేందుకు రంగం సిద్ధమైంది. ‘న్యూ ఎంప్లాయీస్ హెల్త్‌స్కీం’గా దీన్ని వ్యవహరిస్తారు. ఈ పథకాన్ని అమలు చేసేందుకు ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్ (ఈహెచ్‌సీటీ) ఏర్పాటు కానుంది. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య సేవలను రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా అమలు చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ సేవలను ఉచితంగా అందించినప్పటికీ అవి నామమాత్రంగా ఉంటున్నాయి. ప్రైవేటు ఆసుపత్రులకు బకాయిలు సకాలంలో చెల్లించకపోవడంతో ఉద్యోగుల కార్డులు ఆసుపత్రుల్లో సరిగా చెల్లుబాటు కావడం లేదు. మొదట బిల్లులు చెల్లించి రీయింబర్స్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకున్నా బిల్లుల్లో సగం మొత్తం కూడా తిరిగి రావడం లేదు. కొత్తగా అమలయ్యే పథకంలో ఉద్యోగుల బేసిక్ నుంచి ఒకటిన్నర శాతం నగదు భాగస్వామ్యంతో కొత్త మార్గదర్శకాలు విడుదల చేసేందుకు సర్కారు సిద్ధమైనట్లు సమాచారం. ఉదాహరణకు ఒక ప్రభుత్వ ఉద్యోగికి రూ.50 వేల బేసిక్ ఉంటే నెలకు రూ.750 వరకు కొత్త పథకంలో ఉద్యోగి కాంట్రిబ్యూషన్‌గా చెల్లించాల్సి ఉంటుందని తెలిసింది. గురువారం జరిగే సమావేశంలో ఈ పథకంపై పూర్తి స్పష్టత రానుంది. తొలుత ఈ పథకాన్ని బీమా విధానంలో అమలు చేయాలనుకున్నా తర్వాత ట్రస్టు విధానంలోనే అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు పర్యవేక్షణలోనే ఇది కొనసాగనుంది.

# కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ
## ఫోన్ ట్యాపింగ్.. బాంబు పేల్చిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరిన్ని ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ అంశంపై తెలంగాణ రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలోనే కాకుండా, ప్రస్తుతం కూడా రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కొనసాగుతోందని ఆయన బాంబు పేల్చారు. మంగళవారం ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. దీనిపై ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా ఉందని స్పష్టం చేశారు.

*** పరికరాల కోసం వేట.. వదిలిపెట్టే ప్రసక్తే లేదు**

“ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, ఇంకా జరుగుతోం దని చాలా మంది గగ్గోలు పెడుతున్నారు. ఇది అక్షరాలా నిజం. ఇప్పుడు కూడా కొందరు ఈ అక్రమాలకు పాల్పడుతున్నారు. అసలు ఈ ట్యాపింగ్ వెనుక ఉన్న సూత్రధారులు ఎవరు? అక్రమంగా ట్యాపింగ్ చేసే ఎక్విప్‌మెంట్ (పరికరాలు) ఎక్కడెక్కడ అమర్చారు? అనే విషయాలపై ప్రభుత్వం ఇప్పటికే లోతుగా ఆరా తీస్తోంది. విచారణ జరిపి బాధ్యులు ఎవరైనా సరే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజాస్వామ్య స్వేచ్ఛకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదు,” అని పొంగులేటి హెచ్చరించారు.

*** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజనం**

రాష్ట్రంలో బుధవారం జరగనున్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేయబోతోందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. “గడిచిన రెండేళ్లలో మేం చెప్పిన ప్రతి మాటను నిలబెట్టుకున్నాం. అందుకే ప్రజలు మా వెంటే ఉన్నారు. ఈ పుర పోరులో 80 శాతానికి పైగా స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయం. ప్రతిపక్షాల ఆక్రోశం వారి ఓటమి భయానికి నిదర్శనం. జూబ్లీహిల్స్ ఫలితాలే రేపు రాష్ట్రవ్యాప్తంగా పునరావృతం కాబోతున్నాయి,” అని స్పష్టం చేశారు.

**దొరల పాలనలో అప్పుల కుప్ప**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ తీరుపై పొంగులేటి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి ధనిక తెలంగాణను రూ.8.19 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని ఆరోపించారు. “మేము నెలకు రూ.6,300 కోట్లు కేవలం వడ్డీలకే కడుతున్నాం. అయినా సంక్షేమాన్ని ఆపలేదు. గతంలో 62 వేల డబుల్ బెడ్ రూంలను మొండిగోడలుగా మిగిల్చారు. కానీ మేము 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం.” అని మంత్రి వివరించారు. ఉద్యోగులను ఓట్లు అడగడంలో తప్పులేదని, తన పార్టీ గెలుపు కోసం తాను ప్రచారం చేశానని ఓ ప్రశ్నకు సమాధానంగా మంత్రి తెలిపారు.

## హైదరాబాద్ శివారులో భూప్రకంపనలు...
# బయటకు పరుగుతీసిన ప్రజలు

హైదరాబాద్ : హైదరాబాద్ శివారులో స్వల్పంగా భూప్రకంపనలు వచ్చాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ గాజులరామారంలోని మెట్‌ఖాన్‌గూడ ప్రాంతంలో ఉదయం 10:10 గంటలకు భూమి కంపించినట్లు శబ్దం వచ్చింది. దీంతో ఇళ్లలో ఉన్న ప్రజలు బయటకు పరుగు తీశారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా గేటెడ్ కమ్యూనిటీ, అపార్టుమెంట్లు ఉన్నాయి. ప్రకంపనలు రావడంతో వారు ఒక్కసారిగా భయపడి బయటకు వచ్చారు. అయితే ఇది భూమి కంపించడం వల్ల జరిగిందా? లేక చుట్టుపక్కల పేలుడుతో వచ్చిన ప్రకంపనలా అనేది తెలియాల్సి ఉంది. గేటెడ్ కమ్యూనిటీల్లోని సీసీ కెమెరాల్లో భూమి కంపించినట్లు కనిపించింది. స్థానికంగా ఉన్న పాఠశాలకు స్కూల్ యాజమాన్యం సెలవు ప్రకటించింది. స్థానికులు మాట్లాడుతూ, భూమి హఠాత్తుగా కంపించినట్లయిందని, ఏం జరిగిందో తెలియక అందరం బయటకు వచ్చామని చెప్పారు. భారీ శబ్దం వచ్చి భూమి కంపించినట్లు అనిపించిందని అన్నారు. ఈ ఘటన నేపథ్యంలో రెవెన్యూ, సంబంధిత అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.

# వాయుసేనకు 114 కొత్త రఫేల్స్...
## రూ.3.25 లక్షల కోట్ల మెగా డీల్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్!

ఢిల్లీ: భారత వాయుసేన (IAF) అమ్ములపొదిని మరింత పదును పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. మల్టీరోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంఆర్ఎఫ్ఏ) కార్యక్రమంలో భాగంగా ఫ్రాన్స్‌కు చెందిన 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు రక్షణ మంత్రిత్వ శాఖ ఈ వారంలోనే ఆమోదం తెలిపే అవకాశం ఉంది. సుమారు రూ.3.25 లక్షల కోట్ల విలువైన ఈ ఒప్పందం దేశ రక్షణ రంగ చరిత్రలోనే అతిపెద్దది కానుంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఢిల్లీ పర్యటనకు కొద్ది రోజుల ముందే ఈ కీలక పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ఒప్పందం కేవలం విమానాల కొనుగోలుకే పరిమితం కాదు. ఇందులో భాగంగా దాదాపు 100 యుద్ధ విమానాలను “మేక్ ఇన్ ఇండియా” కార్యక్రమం కింద దేశీయంగానే తయారు చేయనున్నారు. అత్యాధునిక ఫైటర్ జెట్ టెక్నాలజీ బదిలీతో పాటు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించే నిబంధనలు కూడా ఈ ఒప్పందంలో ఉన్నాయి. ఈ డీల్ ఖరారైతే ఫ్రాన్స్ తర్వాత రఫేల్ యుద్ధ విమానాలను అత్యధిక సంఖ్యలో వినియోగిస్తున్న దేశాలలో ఒకటిగా భారత్ నిలుస్తుంది. భారత్ వద్ద ఇప్పటికే 36 రఫేల్ ‘C’ వేరియంట్ ఫైటర్ జెట్లు ఉన్నాయి. 2024 డిసెంబర్‌లో చివరి విమానం వాయుసేనకు అందింది. ఈ జెట్లను అంబాలాలోని ‘గోల్డెన్ యారోస్’ (నెం.17 స్క్వాడ్రన్), బెంగాల్‌లోని హసిమారాలో ఉన్న ‘ఫాల్కన్స్’ (నెం.101 స్క్వాడ్రన్)లలో మోహరించారు. వీటితో పాటు రూ.63,000 కోట్లతో 26 నేవల్ వేరియంట్ (రఫేల్ M) జెట్ల కొనుగోలుకు కూడా భారత్ ఆర్డర్ ఇచ్చింది. ఈ నేవల్ వేరియంట్ జెట్లను ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య విమాన వాహక నౌకలపై మోహరిస్తారు.

# మున్సిపల్ ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు



హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, 3 వేల మంది సిబ్బందిని బందోబస్తు కోసం వినియోగిస్తున్నామని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో చేపట్టిన బందోబస్తు ఏర్పాట్లపై మంగళవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరించారు. ‘‘ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక రాష్ట్ర సరిహద్దుల్లో 20, జిల్లాల సరిహద్దుల్లో 55 చెక్‌పోస్టులు, 181 ఫ్లైయింగ్ స్క్వాడ్లు, 167 స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు ఏర్పాటు చేశాం. ఇప్పటివరకు రూ.3.09 కోట్ల సొత్తు స్వాధీనం చేసుకొని 988 కేసులు నమోదు చేశాం. మొత్తం 1,302 అత్యంత సమస్యాత్మక, 1,926 సమస్యాత్మక, 4,975 సాధారణ పోలింగ్ స్టేషన్లు ఉండగా... వీటన్నింటి వద్ద కట్టుదిట్టమైన భద్రత కల్పించాం. అలాగే 436 స్ట్రాంగ్‌రూమ్‌లు, 136 కౌంటింగ్ కేంద్రాల వద్దా కట్టుదిట్టమైన బందోబస్తుకు ఏర్పాట్లు చేశాం’’ అని డీజీపీ వివరించారు. మక్తల్‌లో భాజపా అభ్యర్థి ఆత్మహత్య విషయంలో పోలీసులే ఫిర్యాదు రాసి ఆయన కుమార్తె సంతకం తీసుకున్నారన్న ఆరోపణలపై స్పందిస్తూ.. అలాంటిది ఏమీ లేదని, ఎవరు ఫిర్యాదు ఇచ్చినా దాని ప్రకారమే కేసు నమోదు చేస్తామన్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియలేదని.. ఆయన ఎలాంటి లేఖ రాయలేదని చెప్పారు.

*** ఓటుకు నోటు కేసు ఫైళ్లన్నీ న్యాయస్థానానికి పంపాం**

ఫోరెన్సిక్ ల్యాబ్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై కొంతమంది ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇలాంటి వాటిని నమ్మవద్దని డీజీపీ స్పష్టం చేశారు. ఓటుకు నోటు కేసుకు సంబంధించిన ఫైళ్లన్నీ 2021 నాటికే న్యాయస్థానానికి పంపామని, ఆ వివరాలేవీ ఇక్కడ లేవన్నారు. అగ్నిప్రమాదం వల్ల ఎలాంటి సమాచారం పోలేదని, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరీతోపాటు నాగ్‌పుర్‌లోని ప్రఖ్యాత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైర్ సేఫ్టీ నుంచి కూడా నిపుణులు వచ్చారని, సర్వర్ నుంచి డేటా పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నారని వివరించారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి ఫైళ్లు దగ్ధమయ్యాయా అన్న ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఈ కేసు ఫైళ్లన్నీ దర్యాప్తు అధికారులకు పంపామని, ఎఫ్ఎస్ఎల్‌లో ఒక్క ఫైల్ కూడా పెండింగ్‌లో లేదని చెప్పారు. అయినప్పటికీ మరోసారి పరిశీలిస్తామని, సంఘటనా స్థలాన్ని పరిరక్షించడంలో భాగంగా నిపుణుల సూచనతో తాము కూడా వాటి దగ్గరకు వెళ్లడంలేదని, కొద్దిరోజుల్లోనే దీనిపై స్పష్టత వస్తుందని తెలిపారు.

## సీఎం సొంత జిల్లాలోనే నీటి కష్టాలు..
# గుంటనక్కకు, రేవంత్‌కి మధ్య ఉన్న సంబంధం ఏంటి?

హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లోనే నీటి కష్టాలు ఉన్నాయి. రెండు, మూడు రోజులకోసారి నీళ్లు వస్తున్నాయి. 30 ఏళ్ల కింద ఉన్న సిటీ బస్సులు ఇప్పుడు లేవు.. అంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. తెలంగాణలో రాబోయే మున్సిపల్ ఎన్నికలు, రాష్ట్ర బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ జాగృతి తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. రాష్ట్రంలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, ప్రభుత్వం కేవలం సిద్ధిపేట మున్సిపాలిటీకి మాత్రమే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిధులు మంజూరు చేయడంపై కవిత అనుమానం వ్యక్తం చేశారు.

*** సిద్ధిపేటకే ఎందుకు?**

“కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా, బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నా పనులు మాత్రం వారికే (సిద్ధిపేట) అవుతాయి. ఇది చాలా వెరైటీగా ఉంది. ముఖ్యమంత్రికి, అక్కడి ఎమ్మెల్యేకు (గుంటనక్క అని సంబోధిస్తూ) ఉన్న సంబంధం ఏంటో, దీని వెనుక ఆంతర్యం ఏంటో ప్రజలకు తెలియాలి,” అంటూ కవిత డిమాండ్ చేశారు. ఎన్నికలు లేని సిద్ధిపేటకు నిధులు ఇచ్చి, ఎన్నికలు జరగాల్సిన మిగతా మున్సిపాలిటీలను విస్మరించడం దారుణమని మండిపడ్డారు.

*** మున్సిపాలిటీల దుస్థితి**

సీఎం సొంత జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల్లో ప్రభుత్వ పాఠశాలలు కేవలం ప్రైవేట్ స్కూళ్లకు పిల్లలను పంపించే సెంటర్లుగా మారాయి. బస్తీ దవాఖానాల్లో మందులు, డాక్టర్లు లేరు. ప్రతి మున్సిపాలిటీలో చెత్త గుట్టలుగా పేరుకుపోయింది. సీఎం సొంత నియోజకవర్గ పరిధిలోని ఆమనగల్లులో నడిరోడ్డుపై చెత్త ఉన్నా పట్టించుకునే నాధుడే లేడు.. అని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అవిశ్వాసం తేలేదాకా కుర్చీ ఎక్కను.. స్పీకర్ ఓం బిర్లా సంచలన నిర్ణయం!

ఢిల్లీ : లోక్‌సభలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. తనపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగి, పరిష్కారం లభించేంత వరకు స్పీకర్ స్థానంలో కూర్చోకూడదని ఓం బిర్లా సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇది తన నైతిక బాధ్యత అని, స్పీకర్ స్థానంపై సందేహాలు వ్యక్తమైనప్పుడు తక్షణం చర్చ జరగాలనే సందేశం ఇవ్వడానికే ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నట్లు లోక్‌సభ సచివాలయ వర్గాలు వెల్లడించాయి. మంగళవారం నాడు కాంగ్రెస్ పార్టీ సహా ఇతర విపక్షాలు ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చాయి. స్పీకర్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని, ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, ఇటీవల 8 మంది ఎంపీలను సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 94(c) కింద ఈ నోటీసును సమర్పించాయి. దీనిపై సుమారు 120 మంది విపక్ష ఎంపీలు సంతకాలు చేశారు. ఈ నేపథ్యంలోనే ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నారు. తన అభిప్రాయాన్ని మంగళవారం వివిధ పార్టీల నేతలకు, ప్రతిపక్ష నాయకులకు కూడా తెలియజేశారు. ప్రభుత్వం గానీ, ప్రతిపక్షాలు గానీ కోరినా తాను తన నిర్ణయాన్ని మార్చుకోబోనని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ అవిశ్వాస తీర్మానంపై చర్చ బడ్జెట్ సమావేశాల రెండో భాగం తొలి రోజైన మార్చి 9న జరిగే అవకాశం ఉంది. అప్పటివరకు ఓం బిర్లా స్పీకర్ సీటుకు దూరంగా ఉండనున్నారు. పార్లమెంటరీ చరిత్రలో స్పీకర్‌పై పెట్టిన అవిశ్వాసం ఎప్పుడూ నెగ్గనప్పటికీ, తాజా పరిణామంతో బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరగడం ఖాయంగా కనిపిస్తోంది.

# అల్లాపురం సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు వినతి

*** శ్రీశ్రీశ్రీ సరళ మైసమ్మ దేవస్థానం అభివృద్ధి కమిటీ**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: రాచకొండ పరిధిలోని శ్రీశ్రీశ్రీ సరళ మైసమ్మ దేవస్థానం వ్యవహారాల్లో అనవసరంగా జోక్యం చేసుకొని, అధికార దుర్వినియోగానికి పాల్పడిన అల్లాపురం సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ శ్రీశ్రీశ్రీ సరళ మైసమ్మ దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ వరకాంతం మహిపాల్ రెడ్డి, కమిటీ సభ్యులతో కలిసి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావుకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఈనెల 9న ఓ దినపత్రిక ద్వారా అల్లాపురం సర్పంచ్ లెటర్ హెడ్ పై శ్రీశ్రీశ్రీ సరళ మైసమ్మ దేవస్థానం అభివృద్ధి కమిటీకి సంబంధించి నూతన కమిటీని ఏర్పాటు చేసి, చైర్మన్, సభ్యులను ఎన్నుకున్నట్లు వెలుగులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. శ్రీశ్రీశ్రీ సరళ మైసమ్మ అమ్మవారి దేవస్థానం రాచకొండ గ్రామ సర్వే నంబర్ల పరిధిలో ఉందని, సంబంధిత రెవెన్యూ రికార్డుల ప్రకారం, ఈ దేవస్థానం అల్లాపురం గ్రామ పంచాయతీ పరిపాలనా పరిధిలోకి రాదని పేర్కొన్నారు. ఈ దేవస్థానం భక్తుల విరాళాల ఆధారంగా ఏర్పాటు చేయబడిందని, శ్రీ శ్రీ శ్రీ సరళ మైసమ్మ దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గత 15సంవత్సరాలుగా నిరంతరంగా నిర్వహించబడుతోందని పేర్కొన్నారు. అల్లాపురం గ్రామ పంచాయతీకి ఈ దేవస్థానంపై ఏ విధమైన పరిపాలన, నిర్వహణాధికారం లేదని పేర్కొన్నారు. రాచకొండ రెవిన్యూలో ఉన్న దేవాలయానికి, అల్లాపురం గ్రామ సర్పంచ్ కు దేవస్థానం కమిటీ ఏర్పాటు, రద్దు లేదా పునఃవ్యవస్థీకరణ చేయడానికి పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ఎటువంటి చట్టబద్ధ అధికారం లేదని పేర్కొన్నారు. అధికార పరిధి లేని అంశంలో అధికారిక లెటర్ హెడ్ ఉపయోగించి జోక్యం చేయడం అధికార దుర్వినియోగంగా భావించబడుతుందని, మతపరమైన పరిపాలనలో అనవసర జోక్యానికి దారితీస్తుందని పేర్కొన్నారు. ఈ విధమైన అనధికార చర్యలు భక్తులలో అయోమయం, విభేదాలు తలెత్తే అవకాశాన్ని కలిగించడమే కాకుండా, దేవస్థానం ఆస్తులు, నిరాళాలు, నిర్వాహణపై తీవ్రమైన ప్రమాదాలను కలిగించే అవకాశముందని పేర్కొన్నారు. ఈ విషయమై అల్లాపురం సర్పంచ్ కు వ్రాతపూర్వక అభ్యంతరం తెలియజేసినప్పటికీ, పరిస్థితి మారని కారణంగా ఈ ఫిర్యాదు సమర్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ విషయంలో అల్లాపురం గ్రామ సర్పంచ్ పై పాలనా పరమైన తక్షణ విచారణ చేపట్టాలని, భవిష్యత్తులో దేవస్థానం వ్యవహారాలలో జోక్యం చేయకుండా సర్పంచ్ కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని, అదేవిధంగా అధికార దుర్వినియోగంపై సర్పంచ్ కు వర్తించే నిబంధనల ప్రకారం తగిన శిక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, చౌటుప్పల్ ఎంపీడీవో సందీప్ లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ సరళ మైసమ్మ అమ్మవారి దేవాలయ అభివృద్ధి చైర్మన్ అర్ధ వెంకట్ రెడ్డి, శ్రీశ్రీశ్రీ మైసమ్మ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు కొలను శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సామ అంజిరెడ్డి, ఉపాధ్యక్షులు ముత్యాల నర్సిరెడ్డి, కొలను మాధవరెడ్డి, కోశాధికారి కొలను నరేందర్ రెడ్డి, రాసాల శ్రీకాంత్, ప్రచార కార్యదర్శి సామ సుదర్శన్ రెడ్డి, ముత్యాల సుదర్శన్ రెడ్డి, ఫకీరు శ్రీకాంత్ రెడ్డి, బొడ్డు గాలయ్య తదితరులున్నారు.

## దేవుడిపై ప్రమాణం చేసి..'

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:'దేవుడిపై ప్రమాణం చేసి....' అంటే ఎన్నికల్లో గెలిసిన అభ్యర్థులు పదవీ ప్రమాణ స్వీకారం అనుకుంటున్నారా... అయితే మీరు నోటుకు ఓటులో కాలేసినట్లే. ఓట్ల కోసం అభ్యర్థులు ఓటర్ల వద్ద చేయించుకుంటున్న ప్రమాణాలు ఇవి. అది కూడా ఊరికే ఏం కాదులెండి. డబ్బులిచ్చి మరీ ప్రమాణాలు చేయించుకుంటున్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో అభ్యర్థుల మధ్య తీవ్రమైన పోటీ ఉంది. ఈ నేపథ్యంలో ఒక్కో ఓటుకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు అభ్యర్థులు ఓటర్లకు తాయిలం ఇస్తున్నారు. కాగా డబ్బులు తీసుకుని ఓటు తనకే వేస్తారనే నమ్మకం లేకపోవడంతో అభ్యర్థులు స్వయంగా ఓటర్లతో వారి దేవుళ్లపై ప్రమాణం చేయించుకుంటున్నారు. డబ్బులు తీసుకున్నా ఫర్వాలేదు.. ఓటు మాత్రం నాకే వేయాలంటూ అభ్యర్థిస్తున్నారు. కొందరు ఓటర్లు కూడా తెలివిగా ఎవరు వచ్చి డబ్బులిచ్చినా తీసుకుంటూ 'మా ఓటు మీకే...' అంటుండటం కొసమెరుపు.

## గూడెం కార్పోరేషన్ ఎన్నికలు... సిపిఐకి పైచేయి



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం కార్పోరేషన్ ఎన్నికల్లో ఓటర్లు సిపిఐ వైపు మొగ్గు చూపుతున్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు, కార్పోరేషన్ ఏర్పాటు కోసం చేసిన కృషి సిపిఐకి అనుకూల వాతావరణం కల్పించినట్లు చెబుతున్నారు. పాల్వంచలో ఎర్త్ యూనివర్సిటీ, విద్యుత్ కేంద్రాల ఏర్పాట్లు, విమానాశ్రయం, రింగ్ రోడ్లు, కేంద్రీయ విద్యాలయం వంటి అభివృద్ధి పనులు ప్రజల్లో సానుకూల స్పందన తెచ్చాయి. మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలు కూడా సిపిఐకి మద్దతు పెంచిన అంశాలుగా భావిస్తున్నారు. జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా సారథ్యంలో సిపిఐ ఒంటరిగా పోటీ చేస్తుండగా, 60 డివిజన్లలో సుమారు 30-35 స్థానాలు గెలుచుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్‌కు 18-22, బీఆర్ఎస్‌కు 6-8 స్థానాలు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.సిపిఐకు మెజారిటీ దక్కితే మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు కూడా దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. సిపిఐ పెరుగుతున్న ప్రజాదరణతో ప్రత్యర్థి పార్టీల్లో ఆందోళన నెలకొన్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

## సత్ప్రవర్తనతో సమాజంలో మెలగాలి

*** జగద్గిరిగుట్ట ఇన్ స్పెక్టర్ వెంకటేశం**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : సత్ప్రవర్తనతో సమాజంలో మెలగాలని జగద్గిరిగుట్ట ఇన్ స్పెక్టర్ వెంకటేశం సూచించారు. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ల కదలికలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ నేపథ్యంలో మంగళవారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వారి ప్రస్తుత కార్యకలాపాలను జగద్గిరిగుట్ట ఇన్ స్పెక్టర్ వెంకటేశం ఆరా తీశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగించినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, నేరాలకు పాల్పడినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీషీటర్లపై నిరంతర నిఘా కొనసాగుతుందన్నారు.

## వినాయక్ నగర్ డివిజన్‌లో విద్యుత్ శాఖ 'ప్రజా బాట' కార్యక్రమం



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : విద్యుత్ శాఖ ప్రతిష్టాత్మకగా చేపట్టిన 'ప్రజా బాట' కార్యక్రమం వినాయక్ నగర్ డివిజన్‌లోని శివ నగర్ లో విద్యుత్ అధికారులు నిర్వహించారు. ప్రతి వారం మంగళ, గురు, శనివారాల్లో జరిగే కార్యక్రమంలో భాగంగా మంగళవారం వినాయక నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి, బీజేపీ సీనియర్ నాయకులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి ల ఆహ్వానం మేరకు విద్యుత్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. విద్యుత్ శాఖ సీనియర్ ఇంజనీర్ (ఎస్ఈ ) వెంకన్న వినాయక్ నగర్ ప్రాంతానికి చేరుకుని అధికారుల తో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలను స్వయంగా తనిఖీ చేశారు. స్థానికులు ఎదుర్కొంటున్న విద్యుత్ అంతరాయాలు, వేలాడుతున్న వైర్లు, ఇతర సాంకేతిక సమస్యలను నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ఇబ్బందులను గమనించిన సీనియర్ ఇంజనీర్, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, సంబంధిత అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ వెంకన్న, ఏడీఈ శ్రీనివాస రెడ్డి , డీఈ, ఎఈ లత , అధికారులు, సిబ్బంది, స్థానిక కాలనీ వాసులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# నోటు.. మద్యం... మాంసం...!

*** మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల పండుగ మెనూ**

*** సంబరాల్లో మునిగిపోయిన ఓటర్లు...?**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గత రెండు రోజులుగా ఎన్నికల పండగ కొనసాగింది. ఇల్లందు, అశ్వారావుపేట మున్సిపాలిటీలు, కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో ఓటర్లు 'పండగ' చేసుకున్నారని పలువురు వ్యంగ్యంగా చెప్పుకుంటున్నారు. ముఖ్యంగా కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలు, సుజాతనగర్ మండలంలోని కొన్ని ప్రాంతాలు కలిపి కార్పొరేషన్‌గా ఏర్పడి తొలిసారి కార్పొరేషన్ ఎన్నికలు జరుగుతుండటంతో ఎలాగైనా కార్పొరేటర్ పీఠం ఎక్కాలనే ఆకాంక్షతో అభ్యర్థులు డబ్బులను నీళ్లలా ఖర్చుచేశారనే ప్రచారం జరుగుతోంది. ఎన్నికల్లో గెలుపుకోసం నిర్వహించిన ప్రచారానికి అయిన ఖర్చుకంటే ఓట్ల కోసం ఓటర్లకు పంచిన డబ్బుల లెక్కలే ఎక్కువ అని పలువురు విశ్లేషిస్తున్నారు. కొత్తగూడెం, పాల్వంచలోని డివిజన్లలో మద్యం పంపకాలు విస్తృతంగా జరగ్గా, సుజాతనగర్ మండలంలోని డివిజన్లలో ఏటలు కోసి మాంసం పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా కొందరు అభ్యర్థులు ఇంటికి కేజీ మాంసం, క్వార్టర్ లేదా హాఫ్ మద్యం బాటిల్‌తోపాటు ఓటుకు రూ.వెయ్యి చొప్పున నగదు పంపిణీ చేసినట్లుగా బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. బాగా డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో ఓటుకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు ఖర్చు చేశారని, ప్రచారంలో నీతులు చెప్పిన నాయకులే ఎన్నికల ముందురోజు ఓటర్లకు డబ్బులు ఎరచూపుతున్నారనే ఆరోపణలున్నాయి.

*** పార్టీల నుంచి భారీగా నగదు పంపిణీ..!!**

నూతనంగా ఏర్పడిన కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో పార్టీలు నిలబెట్టిన అభ్యర్థులు ఆర్థికంగా బలహీనులు కావడంతో వారిని గెలిపించే బాధ్యత పార్టీల 'పెద్దలు' తీసుకున్నట్లు తెలుస్తోంది. రిజర్వేషన్ల పరంగా సీట్లు దక్కించుకోలేకపోయినవారు వెనక ఉండి ఇదంతా నడిపిస్తున్నారని సమాచారం. ముఖ్యంగా పార్టీల నుంచే ఒక్కో అభ్యర్థికి లక్షల్లో డబ్బులు ముట్టినట్లు తెలుస్తోంది. కొత్తగూడెం కార్పొరేషన్‌కు, అశ్వారావుపేట మున్సిపాలిటీకి మొదటిసారి జరుగుతున్న ఎన్నికలు కావడంతో ఆయా పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఎలాగైనా కార్పొరేషన్ మేయర్ పీఠంతోపాటు 'పేట' చైర్మన్ పదవిని కైవసం చేసుకోవడానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్‌ను సాధించాలనే ఉద్దేశ్యంతో నగదు పంపిణీ చేసినట్లు పార్టీ కార్యకర్తలే చెప్పుకుంటున్నారు.

*** పోల్ మేనేజ్‌మెంట్‌పై అభ్యర్థుల దృష్టి**

ప్రచారపర్వం ముగిసిన వెంటనే మున్సిపల్, కార్పొరేషన్ అభ్యర్థులు పోల్ మేనేజ్‌మెంట్ పై దృష్టి సారించారు. అభ్యర్థులు కో-ఆర్డినేటర్లను నియమించుకుని వారి ద్వారా ఇంటింటికీ వెళ్లి డబ్బులు, మద్యం, మాంసం పంపిణీ చేయించి, ఓట్లు వేయమంటూ అభ్యర్థించినట్లు సమాచారం. ప్రతీ ఓటు 'విలైవైన'దే కావడంతో దూర ప్రాంతాలలో ఉన్న ఓటర్లను రప్పించేందుకు కూడా ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ప్రతీ 30 ఇళ్లకు ఒక కో ఆర్డినేటర్ చొప్పున ఉండి ఓటర్లకు అవసరమైన 'ఏర్పాట్లు' చేస్తున్నారు. కాగా నేడు ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానుండటంతో అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది.



# నేడే పోలింగ్..ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 106 వార్డుల్లో మొత్తం 1,85,348 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కొత్తగూడెం కార్పొరేషన్‌లో 60 వార్డుల్లో 1,34,775 మంది, అశ్వరావుపేటలో 22 వార్డుల్లో 16,850 మంది, ఇల్లందులో 24 వార్డుల్లో 33,723 మంది ఓటర్లు ఉన్నారు.జిల్లాలో 90 పోలింగ్ కేంద్రాల్లో 288 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. వీటిలో 49 సున్నిత పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక భద్రత కల్పించగా, ఇల్లందులో 4 క్రిటికల్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు వంటి కనీస సదుపాయాలు కల్పించారు. ఎన్నికల నిర్వహణకు 345 ప్రిసైడింగ్ అధికారులు, 1,036 పోలింగ్ అధికారులు, 48 రిటర్నింగ్ అధికారులు, 48 అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు నియమించారు. కౌంటింగ్ నిర్వహణ కోసం మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం 31 జోనల్ అధికారులు, 8 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 10 సర్వైలెన్స్ బృందాలు నిఘా కొనసాగిస్తున్నాయి. పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు సెలవు ప్రకటించారు. ఓటర్లు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## మున్సిపల్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్

మేడ్చల్ ప్రతినిధి, ప్రజాస్ఫూర్తి : మున్సిపల్ ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని అధికారులను జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు సాధారణ మున్సిపల్ ఎన్నికలు బుధవారం జరగనున్న సందర్భంగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొడవలు రకుతావు లేకుండా చూడాలని అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద జనాలు గూమికూడి ఉండకుండ చూడాలని ఆదేశించారు ఎవరైనా అధికారుల పైన గొడవలు చేసిన అల్లరి చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి


**: ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలోని కొత్తగూడెం కార్పోరేషన్,ఇల్లందు,అశ్వారావుపేట మున్సిపాలిటీలకు బుధవారం జరగనున్న పోలింగ్ నేపథ్యంలో పటిష్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు.ఇందులో భాగంగా పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల నందు ఏర్పాటు చేసిన బ్యాలెట్ బాక్సుల పంపిణీ కేంద్రాలను జిల్లా ఎస్పీ పరిశీలించారు.అక్కడ విధులలో ఉన్న అధికారులు,సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ కేంద్రాల వద్ద 1200 మందితో భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.పోలింగ్ కేంద్రాల పరిసరాలలో నిరంతర నిఘా కొరకు ప్రత్యేక బృందాలను నియమించడం జరిగిందన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రమైన పాల్వంచ అనుబోస్ కళాశాల పరిసర ప్రాంతాలను డాగ్స్ స్క్వాడ్,బాంబుస్క్వాడ్ తో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని అన్నారు.ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

## ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తన లక్ష్యం

*** గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేట్ మేకల సునీత యాదవ్**



మల్కాజ్గిరి, ప్రజాస్ఫూర్తి : ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తన లక్ష్యమని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేట్ మేకల సునీత యాదవ్ అన్నారు. మంగళవారం కార్పొరేట్ మేకల సునీత యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చొరవతో రిజర్వాయర్ మంజూరైనట్లు తెలిపారు. మల్కాజ్గిరి సర్కిల్ తో పాటు గౌతమ్ నగర్ డివిజన్ ప్రజల తాగునీటి సమస్య పరిష్కరించేందుకు మహేంద్ర హిల్స్ లో రూ.14.95 కోట్లతో 5 ఎంఎల్ రిజర్వాయర్ నిర్మాణ పనులు ప్రారంభించుకున్నామని తెలిపారు. మహేంద్ర హిల్స్ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి అయితే గౌతమ్ నగర్ డివిజన్ ప్రజలతోపాటు మల్కాజిగిరి ప్రజలకు 24 గంటలు సస్యశ్యామలంగా మంచినీరు అందుతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా 5 సంవత్సరాల పరిపాలనలో 72 కోట్ల రూపాయల జిహెచ్ఎంసి నిధులతో గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు తోపాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశామని తెలిపారు. 4:30 కోట్ల రూపాయలతో జ్యోతి నగర్, హనుమాన్ పేట్ వద్ద రైల్వే పట్టాల కింద నుండి మురికి కాలువ పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. ఈ మౌలిక వసతులు ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి చెరువుతో జరిగాయని తెలిపారు అలాగే ఇందిరా నెహ్రూ నగర్ లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు

# వికారాబాద్ లో రోడ్డు ప్రమాదం


* ఒకరికి గాయాలు



వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో .జరిగింది. వివరాల ప్రకారం..... వికారాబాద్ పట్టణంలోనీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఉన్న రైల్వే గేట్ సమీపంలో రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఓ వ్యక్తి గాయపడగా పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స కోసం వెంటనే ప్రైవేటు వసుపత్రికి తరలించారు సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి విచారణ చేపట్టారు ప్రమాదానికి గల కారణాలపై వివరాలు సేకరిస్తున్నారు

# అందం..ఆరాధన...

## (ఒక పరిమళం...ఒక హెచ్చరిక)



రచన: కవి రత్న
సాహిత్య ధీర సహస్ర కవి భూషణ్
**పోలయ్య కూకట్లపల్లి**
అత్తాపూర్ హైదరాబాద్
చరవాణి...9110784502

ముత్యపుచిప్పలో మెరిసే
ముగ్ధమోహన రూపం
కళ్ళలో వెన్నెల వాన
కదిలే ఆ బాపుబొమ్మ
పెదవుల అంచుల్లో
చిగురించిన గులాబీలను
గుర్తు చేసుకున్న ప్రతిసారీ
మది పరిమళ భరితమే
పరవశమే
అవ్యక్త అనురాగ
ఆరాధనామకరందమే

కానీ..ఆరాధన అంటే..?
ఆత్మను గౌరవించడం....
అనురాగాల్ని ఆప్యాయతల్ని
అగ్నిలోవేసి బుగ్గిపాలు
చేయడం కాదు
పూవును తిలకించి
పులకించాలే గానీ..
తుమ్మెదలై ప్రాణాల్ని
తోడెయ్యరాదు...

అందం చూసి
మోహించవచ్చు
కానీ ఆ మోహం మృగత్వం
కారాదు...
నిన్న దేవతగా పూజించిన ఆ
చేతులే
నేడు నిర్దాక్షిణ్యంగా ప్రాణాలు
తీస్తాయా..?

నిన్న ముసిముసి నవ్వులు
రువ్వుతూ
ముద్దు పెట్టి మురిపించిన ఆ
ముఖాన
నేడు ఆసిడ్ దాడులా..?
రాక్షస క్రీడలా..?
నిన్న నీకు స్వర్గాన్ని చూపిన ఆ
శరీరాన్ని
నేడు కర్కశంగా కాల్చి
బూడిదచేయడమో

ఎంతటి దారుణం..?
ఎంతటి అహంకారం..?
నయవంచకుడైన నరునిలో
దాగిన ఆ నరరూప
రాక్షసత్వానికి...
మానవత్వం మంటగలిపే ఆ
క్రౌర్యానికి..
అంతమెప్పుడు...
అది మహిళలు
మేల్కొన్నప్పుడు..
ఆదిపరాశక్తి
స్వరూపాలాగ్రహించినప్పుడు
ఆడది అబల కాదు....
ఆత్మగౌరవ శిఖరం

ఆ ప్రేమద్రోహికి...
ఆ ప్రేమపిశాచికి...
దక్కాల్సింది ఒక్కటే
జైలుశిక్ష కాదు బహిరంగ
శిరశ్ఛేధమే...

# ప్రతీ వాహనదారుడు కచ్చితంగా ట్రాఫిక్ నియమాలను పాటించాలి

* **ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్**



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతీ వాహనదారుడు కచ్చితంగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్నపాటి అజాగ్రత్త కూడా ప్రాణనష్టానికి దారితీసే ప్రమాదం ఉందన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం ప్రాణాంతకమన్నారు. తాగిన మత్తులో డ్రైవింగ్ చేయడం కారణంగా వాహనం నడిపే వారే కాకుండా ఇతరుల ప్రాణాలను ప్రమాదంలో నెట్టిన వారమవుతామన్నారు. అధిక వేగం, మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్ రూట్ లో ప్రయాణించడం, హెల్మెట్, సీట్ బెల్ట్ లేకపోవడం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటి కారణాల వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన హెచ్చరించారు. రాంగ్ రూట్ లో వెళ్లడం, ఓవర్ టేక్ చేయడం, సిగ్నల్ దాటేయడం అనే చిన్న, ఒక్క తప్పు అజాగ్రత్త మీ సమయాన్ని ఆదా చేయవు... జీవితాన్ని కోల్పోయే ప్రమాదాన్ని పెంచుతాయి. గుర్తుంచుకోండి — ప్రమాదం జరిగిన తర్వాత పశ్చాత్తాపం మాత్రమే మిగులుతుంది. “కొద్దిదూరమే కదా.. ఏమవుతుందిలే” అనే నిర్లక్ష్యం ఒక్కోసారి ప్రాణాంతకమవుతుందని, రోడ్డుపై నడిచేటప్పుడైనా, వాహనం నడిపేటప్పుడైనా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వెనుక కూర్చునే పిలియన్ రైడర్ కూడా తప్పనిసరిగా హెల్మెట్ ఉపయోగించాలన్నారు. హెవీ వెహికిల్స్, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలి. కేవలం పోలీసులు ఫైన్లు వేస్తారని భయంతో పాటించాల్సినవి కావని — ప్రాణాలను కాపాడే భద్రతా నియమాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా పాదచారులు రోడ్డు దాటేటప్పుడు ఏమరుపాటుగా ఉండవద్దన్నారు. వేగ పరిమితిని మించకూడదని, మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, వాహన పత్రాలు లేకుండా ప్రయాణించడం కూడా నేరమని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు లైసెన్స్, రిజిస్ట్రేషన్, బీమా , కాలుష్య నియంత్రణ పత్రాలు ఉంచుకోవాలన్నారు. లేన్ క్రమశిక్షణ పాటించడం ద్వారా ట్రాఫిక్ రద్దీ తగ్గడమే కాకుండా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ప్రతి వాహనదారుడు క్రమశిక్షణతో ప్రయాణించడం ద్వారా తమతో పాటు ఇతరుల ప్రాణాలు కాపాడిన వారవుతారన్నారు. “రోడ్డుపై కొన్ని క్షణాల మీ అజాగ్రత్త.. మీ కుటుంబంతో పాటు మరొక కుటుంబాన్ని కూడా విషాదంలోకి నెడుతుంది,” అన్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలపై తనిఖీలు, చట్టపరమైన చర్యలు నిరంతరం కొనసాగుతాయని, ప్రతి వాహనదారుడు చిత్తశుద్ధితో నియమాలు పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# అల్విన్ కాలనీ డివిజన్ ను

## 450 కోట్ల పైచిలుక నిధులతో అభివృద్ధి చేశాం

* **అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**

శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ ఆశీర్వాదంతో అల్విన్ కాలనీ డివిజన్ ను 450 కోట్ల పైచిలుక నిధులతో అభివృద్ధి చేశామని అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. రెండు సార్లు కార్పొరేటర్ గా గెలిచి డివిజన్ ను ఎన్నో రకాలుగా అభివృద్ధి చేసి, ప్రజల మన్ననలు పొందిన కార్పొరేటర్గా పేరు తెచ్చుకున్న ప్రజా నాయకుడు దొడ్ల వెంకటేష్ గౌడ్ పదవి కాలం మంగళవారంతో పూర్తవుతున్న సందర్భంగా పలువురు నాయకులు కార్పొరేటర్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించడం, ముచ్చటగా మూడోవసారి కూడా కార్పొరేటర్ గా గెలవాలని కోరడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలకు వరదనీరు రాకుండా పరికి చెరువు నాలకు రిటైనింగ్ వాల్ నిర్మించి శాశ్వత పరిష్కారం చూపామని తెలిపారు. ఒకప్పుడు స్లంగా ఉండే డివిజన్ అంతా ఇప్పుడు ఎంతగానో అభివృద్ధి చెంది ఆధునిక అంగులతో కళకళలాడుతుందని తెలియజేశారు. డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్యం, మంచి నీరు వంటి అన్ని రకాల మౌలిక సదుపాయాలు అందించి అభివృద్ధి చేశామని గుర్తుచేసారు. చిన్న చిన్న వర్షాలకే ముంపుకు గురైయే ఎల్లమ్మబండ ధరణి నగర్ వంటి తెలిపారు. గ్రేవీ యాడ్లు, వీధి దీపాలు, చెరువులు సంరక్షణ, రోడ్డు విస్తరణ వంటి అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టమని అన్నారు. పేద ప్రజలు ఎక్కువగా ఉన్న డివిజన్లో పార్టీలతో సంబంధం లేకుండా ఎవరు చనిపోయిన వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించామని గుర్తు చేసారు. రెండుసార్లు కార్పొరేటర్ గా గెలపించి తన వెంటే ఉన్న అల్విన్ కాలనీ డివిజన్ ప్రజలకు కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, అభిమానులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

### సంఘం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు

# తన సంపూర్ణ సహకారం

* **బి.ఆర్.ఎస్.ఎల్.పి. విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : సంఘం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని బి.ఆర్.ఎస్.ఎల్.పి. విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ భరోసా ఇచ్చారు. మంగళవారం పెట్ బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో దుండిగల్ గండిమైసమ్మ మండల నాయీ బ్రాహ్మణుల సేవా సంఘం ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన అధ్యక్షులు చిట్కుల అశోక్ నాయి, ప్రధాన కార్యదర్శి చిటుకుల రాజు నాయీ, వైస్ ప్రెసిడెంట్ సాయి నాయీ , వారి కమిటీ సభ్యులతో కలిసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బి.ఆర్.ఎస్.ఎల్. పి. విప్, ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజ సేవ, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో సంఘం మరింత చురుకుగా పాల్గొని ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓం మణికంఠ నాయి బ్రాహ్మణ సేవా సంఘం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అధ్యక్షులు గడిల వెంకటేశ్వర్లు నాయి చీఫ్ సెక్రటరీ, వి.ఎస్.ఆర్.వెంకట్ నాయీ, చైర్మన్ జె.రవీందర్ నాయీ, మాజీ అధ్యక్షులు ఏ.రేణయ్య నాయీ, మహిళా అధ్యక్షురాలు మైలారం పద్మ నాయీ, పోచంపల్లి కృష్ణ నాయీ, బోరంపేట్ పరుశురామ్ నాయీ, సోషల్ మీడియా కన్వీనర్ శివ కుమార్ నాయీ, చింటూ నాయీ, మల్లంపేట్ అధ్యక్షులు విజయ్ నాయీ, అనిల్ నాయీ, రవికాంత్ నాయీ, తదితరులు పాల్గొన్నారు..

# యాపిల్ సైడర్ వెనిగర్.. ఇలా కూడా!

**ఇంటిని శుభ్రం చేయడం దగ్గరి నుంచి వంటలకు మంచి రుచి తీసుకురావడం దాకా.. ఎన్నో అవసరాల కోసం యాపిల్ సైడర్ వెనిగర్‌ను ఉపయోగిస్తుంటాం. అయితే దీన్ని ఇంట్లో మరెన్నో పనులకూ వాడచ్చంటున్నారు నిపుణులు. మరి, ఆ చిట్కాలేంటో మనమూ తెలుసుకుందామా..?!**

* కొత్తగా కొన్న పాత్రలపై అతికించిన స్టిక్కర్లు, బార్‌కోడ్‌లను తొలగించడం కాస్త కష్టమే. అయితే యాపిల్ సైడర్ వెనిగర్‌ను ఉపయోగించి వాటిని సులభంగా తొలగించవచ్చు. స్ప్రే బాటిల్‌లో కొద్దిగా యాపిల్ సైడర్ వెనిగర్ పోసి దాన్ని స్టిక్కర్లపై స్ప్రే చేయాలి. ఆ తర్వాత చేత్తో రుద్దితే అవి సులువుగా పోతాయి.
* చిన్నారుల పాలడబ్బాలు, బాటిల్ నిపుల్స్‌ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోతే వారు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలుంటాయి. వీటిని వెనిగర్‌తో శుభ్రం చేయడం ద్వారా బ్యాక్టీరియా పెరగకుండా కాపాడుకోవచ్చు.



వేడినీటిలో కొద్దిగా యాపిల్ సైడర్ వెనిగర్‌ని కలిపి ఆ మిశ్రమంతో రోజుకోసారి పాలడబ్బాలు, బాటిల్ నిపుల్స్‌ని కడగాలి. ఆపై మరోసారి వేడినీటితో వీటిని శుభ్రం చేస్తే సరిపోతుంది.

* కొన్ని సందర్భాల్లో కొవ్వొత్తుల కారణంగా ఫ్లోర్, చెక్క వస్తువులపై మరకలు ఏర్పడతాయి. వాటిని యాపిల్ సైడర్ వెనిగర్‌తో సులభంగా పోగొట్టచ్చు. దీనికోసం సమపాళ్లలో యాపిల్ సైడర్ వెనిగర్, నీటిని తీసుకొని బాగా కలపాలి. ఈ మిశ్రమంలో వస్త్రాన్ని ముంచి మరక ఏర్పడిన చోట రుద్దితే సరి..!
* ఉల్లి, వెల్లుల్లి, చేపలు, మాంసం వాసన చేతుల నుంచి అంత త్వరగా పోదు. సబ్బుతో చేతులు కడిగినప్పటికీ ప్రయోజనం ఉండదు. అయితే యాపిల్ సైడర్ వెనిగర్ ద్వారా ఈ సమస్య నుంచి బయటపడొచ్చు. సబ్బుతో చేతులు కడిగిన తర్వాత కొద్దిగా ఈ వెనిగర్ కలిపిన నీటితో చేతులు కడుక్కోవాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కడుక్కుంటే చేతుల నుంచి ఎలాంటి వాసన రాదు.
* కళ్లద్దాలపై ఏర్పడిన మరకలను యాపిల్ సైడర్ వెనిగర్‌తో సులభంగా తొలగించచ్చట! ఇందుకోసం కళ్లద్దాలపై యాపిల్ సైడర్ వెనిగర్‌ను స్ప్రే చేసి మెత్తటి వస్త్రంతో తుడిస్తే మరక పోతుంది.
* ఆహారపదార్థాలు మాడిపోయినప్పుడు పాత్రలు నల్లగా తయారవుతాయి. యాపిల్ సైడర్ వెనిగర్‌తో ఈ మరకలు సులభంగా వదులుతాయి. మాడిపోయిన పాత్రలో



కప్పు నీరు, కప్పు యాపిల్ సైడర్ వెనిగర్ పోసి స్టౌపై ఉంచి బాగా వేడి చేయాలి. స్టౌ కట్టేశాక రెండు స్పూన్ల బేకింగ్ సోడాను కలిపితే నురగ మాదిరిగా వస్తుంది. అది రావడం ఆగిపోయిన తర్వాత పాత్రలోని మిశ్రమాన్ని ఒంపి నీటితో శుభ్రం చేయాలి. ఆపై పేపర్ టవల్‌తో తుడిస్తే సరిపోతుంది.



# తెలంగాణలో నేడు మున్సిపల్ ఎన్నికలు... సర్వం సిద్ధం

* తెలంగాణలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు బుధవారం పోలింగ్
* ఓటు హక్కును వినియోగించుకోనున్న 52 లక్షల మందికి పైగా ఓటర్లు
* మొత్తం 2,981 వార్డులకు బరిలో 12,944 మంది అభ్యర్థులు

హైదరాబాద్ : తెలంగాణలో పురపాలక ఎన్నికల పోరుకు రంగం సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో బుధవారం (ఫిబ్రవరి 11) పోలింగ్ జరగనుండగా, ఇందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం (SEC) అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ ఎన్నికల్లో మొత్తం 52,17,413 మంది ఓటర్లు తమ




ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరి కోసం 8,191 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రక్రియ బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణ కోసం 1,379 మంది రిటర్నింగ్ అధికారులు, 41,773 మంది పోలింగ్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఓటర్లు తమ ఓటర్ స్లిప్పులను ఎస్ఈసీ వెబ్‌సైట్ లేదా TEPOLL యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. మొత్తం 2,981 వార్డులకు గాను 12,944 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే, 116 మున్సిపాలిటీల్లోని 2,569 వార్డులకు పోలింగ్ జరగనుంది. తొమ్మిది మున్సిపాలిటీల్లో 12 మంది అభ్యర్థులు ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మున్సిపాలిటీల్లో అధికార కాంగ్రెస్ నుంచి 2,358 మంది, బీఆర్ఎస్ నుంచి 2,478 మంది, బీజేపీ నుంచి 2,252 మంది సహా మొత్తం 10,719 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అయితే, సోమవారం రాత్రి నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడంతో ఆ వార్డులో పోలింగ్‌ను వాయిదా వేస్తున్నట్లు ఎస్ఈసీ ప్రకటించింది. మున్సిపాలిటీల కోసం 6,017 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇక 7 మున్సిపల్ కార్పొరేషన్లలోని 412 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. మహబూబ్‌నగర్, రామగుండం కార్పొరేషన్లలో రెండు వార్డుల్లో అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. ఈ కార్పొరేషన్లలో కాంగ్రెస్ నుంచి 410, బీఆర్ఎస్ నుంచి 401, బీజేపీ నుంచి 382 మంది సహా మొత్తం 2,225 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. కార్పొరేషన్ల పరిధిలో 2,174 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని డీజీపీ బి. శివధర్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 1,302 పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా, 1,926 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించామని, అక్కడ అదనపు బలగాలను మోహరించామని వివరించారు. పారదర్శకత కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామని, సమస్యాత్మక ప్రాంతాల్లోని కేంద్రాల బయట నిఘా కెమెరాలు కూడా ఉపయోగిస్తున్నామని చెప్పారు.

## బీజేపీ అభ్యర్థి ఆత్మహత్యకు ఆ మంత్రి బెదిరింపులే కారణం: రామచందర్ రావు

* మక్తల్ లో మహదేవప్ప ఆత్మహత్య కలచివేసిందన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు
* కాంగ్రెస్ అహంకారపూరిత రాజకీయాలే కారణమని ఫైర్
* నిష్పక్షపాత విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

హైదరాబాద్ : మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కు ముందు మక్తల్ లో బీజేపీ అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్యకు



పాల్పడిన విషయం తెలిసిందే. దీనిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. అధికార పార్టీ కాంగ్రెస్ అహంకారపూరిత రాజకీయాలు, మాఫియా బెదిరింపుల వల్లే తమ అభ్యర్థి బలవన్మరణానికి పాల్పడ్డారని ఆరోపించారు. మహదేవప్ప మరణం తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేస్తూ, అతని కుటుంబానికి సంతాపం తెలిపారు. మంత్రి శ్రీహరి, ఆయన అనుచరుల వేధింపుల వల్లే మహదేవప్ప ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయని చెప్పారు. దీనిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు. మంత్రి శ్రీహరిని వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించి అరెస్ట్ చేయాలని అన్నారు. మహదేవప్ప కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం చేస్తుందని రామచందర్ రావు స్పష్టం చేశారు.

## నా పేరును మార్చడానికి మీరెవరు?: రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్ : మా తల్లి పెట్టిన పేరును మార్చి పిలవడానికి మీరెవరంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాను ఎవరికో దత్తపుత్రుడినని, కల్వకుంట్ల కిషన్ రావు అని పేరు మార్చుకోవాలని ముఖ్యమంత్రి విమర్శలు చేయడం ఏంటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పేరు మార్చి పిలవడం సరికాదని అన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి మధ్య ఏమైనా ఉంటే వారే తేల్చుకోవాలని, తనను మధ్యలోకి లాగవద్దని సూచించారు. అంతగా



అవసరమైతే మీరు రేవంత్ ఖాన్ అని మార్చుకోవచ్చని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అన్నారు. కానీ మా తల్లి పెట్టిన పేరును మార్చడానికి మీరెవరని ప్రశ్నించారు. వ్యక్తిగత విమర్శలు సరికాదని హితవు పలికారు. మజ్లిస్ పార్టీతో కలిసి ముందుకు సాగినన్ని రోజులు మేం నిలదీస్తూనే ఉంటామని అన్నారు. తెలంగాణలో అన్ని స్థానాల్లో మజ్లిస్ పార్టీ ఎందుకు పోటీ చేయడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్‌ను అరెస్టు చేయాలంటూ మాకు చెప్పడమేమిటని ప్రశ్నించారు. కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అరెస్టు చేస్తే ఎవరూ అడ్డురాకుండా తాను చూసుకుంటానని అన్నారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిదా? లేక కిషన్ రెడ్డిదా? తెలంగాణ ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంకలు ఒక్కసారైనా కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడారా అని ప్రశ్నించారు. బీజేపీ ఎప్పుడూ బీఆర్ఎస్ పార్టీతో కలవలేదని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి ఎన్నికల్లో పోటీ చేశాయని గుర్తు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను రెండేళ్లు పూర్తయినా అమలు చేయలేదని విమర్శించారు. మక్తల్ బీజేపీ అభ్యర్థి మహదేవప్ప మృతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని అన్నారు.

## ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్ని ప్రమాదం.. ఓటుకు నోటు కేసు డాక్యుమెంట్లపై స్పందించిన డీజీపీ

హైదరాబాద్ : నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంపై విచారణ జరుగుతోందని తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందో విచారణ జరుపుతున్నామని అన్నారు. ఓటుకు నోటు కేసులో కీలకమైన ఫైల్స్ తగలబడిపోయాయనే ప్రచారంలో వాస్తవం లేదని అన్నారు. 2015 నాటి ఈ కేసులో ఆధారాలను 2021లోనే కోర్టుకు సమర్పించినట్లు తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ అన్నీ పరిశీలించాకే నివేదికలు ఇచ్చామని అన్నారు. రేపు తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని,





హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉందని డీజీపీ వెల్లడించారు. బందోబస్తు కోసం ఇతర శాఖల నుంచి మూడు వేల అదనపు బలగాలను రప్పించామని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు 1,183 లైసెన్స్‌డ్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని... 4,318 మందిని బైండోవర్ చేశామని, 398 మందికి నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేశామని వెల్లడించారు. నాలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో 20 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో 55 చెక్ పోస్టులు ఉన్నాయని అన్నారు. ఇప్పటి వరకు రూ.3.09 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నామని డీజీపీ తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి 142 కేసులు నమోదు చేశామని అన్నారు. 181 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను సిద్ధం చేశామని అన్నారు. మక్తల్‌లో బీజేపీ అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు అందిందని, కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

## మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు కొన్ని గంటల ముందు.. పెద్ద మొత్తంలో నగదు పట్టివేత

* రూ.67 లక్షల నగదు స్వాధీనం చేసుకున్న గోషామహల్ పోలీసులు
* నిందితులు కొంతకాలంగా నగదు అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు గుర్తించిన పోలీసులు
* నగదు, నిందితులను ఆదాయపన్ను శాఖకు అప్పగించిన పోలీసులు


హైదరాబాద్ : తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు కొన్ని గంటల ముందు హైదరాబాద్‌లో పోలీసులు పెద్ద మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా తరలిస్తున్న రూ.67 లక్షలను గోషామహల్ పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి జ్యోతారామ్, గణపత్‌రామ్, మహేందర్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వీరు ముగ్గురు ముఠాగా ఏర్పడి కొంతకాలంగా నగదు అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు.



పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బేగంబజార్‌కు చెందిన కపిలేశ్ సూచనల మేరకు నిందితులు అఫ్జల్‌గంజ్‌లో ఒక వ్యక్తి వద్ద నుంచి రూ.67 లక్షలకు పైచిలుకు నగదు తీసుకుని తమ ముఠా సభ్యులకు అప్పగించేందుకు వెళుతుండగా, సమాచారం అందుకున్న పోలీసులు వారి స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో నగదును స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేశారు. నిందితులను, నగదును ఆదాయపన్ను శాఖకు అప్పగించారు.

## హైదరాబాద్‌లో రూ.1,511 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

హైదరాబాద్ : హైదరాబాద్‌లో నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో హైడ్రా రూ.1,511 కోట్ల విలువైన భూమిని రక్షించింది. ప్రభుత్వ భూములు, పార్క్ స్థలాలను ఆక్రమణల చెర నుంచి హైడ్రా విడిపించింది. ఆ భూముల చుట్టూ ఫెన్సింగ్ వేసి బోర్డులను ఏర్పాటు చేసింది. ఆక్రమణలను సీరియస్‌గా పరిగణిస్తున్న హైడ్రా... పార్కులు, చెరువులను ఆక్రమించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తోంది.





*** కొండాపూర్‌లో చెరువును కాపాడిన హైడ్రా**


శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం మదీనాగూడ రోడ్డు మార్గం కొండాపూర్‌లో రూ.700 కోట్ల విలువైన భూమిని హైడ్రా కాపాడింది. 4 ఎకరాల జంగం కుంటను పూడ్చేసి మట్టితో చదును చేసి ప్లాట్లుగా విక్రయించేందుకు సిద్ధమైన కబ్జాదారుల ఆట కట్టించింది. ఇటీవల మీడియాలో వచ్చిన కథనాల మేరకు రెవెన్యూ అధికారులతో హైడ్రా జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసింది. జంగం కుంటగా హైడ్రా నిర్ధారించుకుంది. కబ్జా చేసిన వారిపై రెవెన్యూ అధికారులు కేసులు కూడా పెట్టారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు ఫెన్సింగ్ వేసింది.

*** అల్వాల్ కొత్త చెరువులో ఆక్రమణల తొలగింపు**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలంలోని అల్వాల్ కొత్త చెరువు 8 ఎకరాల మేర ఆక్రమణలను హైడ్రా తొలగించింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్లాస్టిక్ కంప్రెసివ్ యూనిట్, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కార్యకలాపాలు నిర్వహిస్తూ చెరువును కలుషితం చేస్తున్నారని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే అక్కడ పని వారికోసం తాత్కాలిక షెడ్డులు వేసి వ్యర్థాలన్నీ చెరువులోకి వదులుతున్నారని పేర్కొన్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని టెంటు సామగ్రికి చెందిన 4 షట్టర్లు కూడా వేసినట్టు ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చెరువు ఆక్రమణలను నిర్ధారించుకున్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి కట్టడాలు, నిర్మాణాలు చేయరాదనే నిబంధన పట్టకుండా ఏర్పాటు చేసిన షెడ్డులను హైడ్రా తొలగించింది.

*** 1100 గజాల పార్కులను కాపాడిన హైడ్రా**

వనస్థలిపురం సాహెబ్‌నగర్ కలాన్‌లోని జక్కిడినగర్ కాలనీలో 650 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. సర్వే నంబరు 132, 133లో 1982లో 12 ఎకరాల మేర దాదాపు 161ప్లాట్లతో జక్కిడి కుటుంబ సభ్యులు లే ఔట్ వేశారు. ఇందులో 650 గజాల మేర పార్కుకోసం కేటాయించారు. 1985లోనే దీనిని ప్లాట్లుగా చేసి లే ఔట్ వేసిన వారే అమ్మేశారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ప్రహరీతో పాటు రెండు షెడ్డులు నిర్మించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో హైడ్రా పరిశీలించి పార్కు స్థలంగా నిర్ధారించుకుంది. మంగళవారం ఆక్రమణలు తొలగించి పార్కు చుట్టూ ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. మల్కాజిగిరి జోన్, మౌలాలి సర్కిల్ పరిధిలోని కాకతీయ నగర్‌లో రాధాకృష్ణ హౌసింగ్ కాలనీలో 450 గజాల పార్కును హైడ్రా కాపాడింది. జీహెచ్ఎంసీకి గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చిన ఈ పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన ప్రహరీతో పాటు రేకుల షెడ్డును హైడ్రా తొలగించింది.



## తెలంగాణ బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులు.. కేంద్రం నుంచి కీలక ప్రకటన

ఢిల్లీ : తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులు పరిశీలనలో ఉన్నాయని లోక్ సభలో కేంద్ర ప్రభుత్వం తెలిపింది. తెలంగాణలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడంపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. దీనితో కేంద్ర మంత్రి బీఎల్ వర్మ వివరణ ఇచ్చారు. రెండు బీసీ బిల్లులు రాష్ట్రపతి ఆమోదం కోసం వచ్చాయని, అవి పరిశీలనలో ఉన్నాయని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ పెంపునకు సంబంధించి తెలంగాణ శాసనసభ కార్యదర్శి నుంచి రెండు బిల్లులు రాష్ట్రపతి ఆమోదానికి వచ్చాయని తెలిపారు. ఈ బిల్లులు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అసెంబ్లీలో ఆమోదం పొందిన రెండు బిల్లులను కేంద్ర ప్రభుత్వానికి పంపించడం తెలిసిందే.

# సచిన్ ఇంట పెళ్లి సందడి.. ప్రధాని మోడీ, రాహుల్ గాంధీకి ఆహ్వానం

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఇంట పెళ్లి సందడి మొదలైంది. తన కుమారుడు అర్జున్ టెండూల్కర్ వివాహ వేడుకకు రావాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని ఆహ్వానించారు. ఈ మేరకు సచిన్ తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ప్రధానిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా సచిన్ పంచుకున్నారు. 'ప్రధాని నరేంద్ర మోడీని కలిసి అర్జున్ సానియా వివాహానికి ఆహ్వానించడం మాకు దక్కిన గౌరవం. నూతన వధూవరులకు మీరు అందించిన ఆశీస్సులు, విలువైన సలహాలకు





ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. ప్రధానితో పాటు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని కూడా సచిన్ తన కుటుంబంతో కలిసి వివాహానికి ఆహ్వానించారు.

**మార్చి 3 నుంచి వేడుకలు..**

అర్జున్ టెండూల్కర్, సానియా చందోక్‌ల వివాహ వేడుకలు ఈ ఏడాది మార్చి 3న ప్రారంభమై, మార్చి 5న అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల మధ్య వైభవంగా జరగనున్నాయి. గత ఏడాది ఆగస్టులో వీరిద్దరికీ నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే.

**ఎవరీ సానియా చందోక్?**

ముంబైలోని అత్యంత ధనిక కుటుంబాలలో ఒకటైన ఘాయ్ కుటుంబానికి చెందిన సానియా చందోక్, ప్రముఖ వ్యాపారవేత్త రవి ఘాయ్ మనవరాలు. ఆమె ప్రస్తుతం 'మిస్టర్ పాస్ పెట్ స్పా & స్టోర్' (Mr. Paws Pet Spa & Store LLP) సంస్థకు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. వీరి కుటుంబానికి హాస్పిటాలిటీ రంగంలో మంచి పట్టు ఉంది. ప్రసిద్ధ 'ఇంటర్ కాంటినెంటల్' హోటల్, 'బ్రూక్లిన్ క్రీమరీ' ఐస్‌క్రీమ్ బ్రాండ్ వీరి యాజమాన్యంలోనే ఉన్నాయి.

## కాంగ్రెస్ నేతలపై.. అస్సాం సీఎం రూ.500 కోట్ల పరువునష్టం దావా

అస్సాంలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార, ప్రతిపక్ష నేతల మధ్య ఆరోపణలు తారస్థాయికి చేరాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి, ఆయన కుటుంబీకులు దాదాపు 1200 బిఘాల భూమి ఆక్రమించారంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సీఎం హిమంత బిశ్వ శర్మ.. తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఆరోపణలు చేసిన కాంగ్రెస్ నేతలపై పరువునష్టం దావా వేసినట్లు వెల్లడించారు. "కాంగ్రెస్ నేతలు ఇటీవల మీడియా సమావేశం



ఏర్పాటు చేసి నాపై తప్పుడు, దురుద్దేశపూర్వకంగా, పరువుకు నష్టం కలిగించే ఆరోపణలు చేశారు. జితేంద్ర సింగ్, భూపేంద్ర సింగ్ బఘేల్, గౌరవ్ గొగొయ్‌ల నుంచి రూ.500 కోట్ల నష్టపరిహారం కోరుతూ దావా వేశాను" అని అస్సాం సీఎం పేర్కొన్నారు. అంతకుముందుకు కాంగ్రెస్ నేత గొగొయ్ మాట్లాడుతూ.. ఓ వర్గంపై ముఖ్యమంత్రి విద్వేష వ్యాఖ్యలు చేశారని అన్నారు.

**భాజపా నేతలపై ఫిర్యాదు..**

ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ వ్యాఖ్యలు చేశారని రాష్ట్ర కాంగ్రెస్ ఆరోపించింది. సోషల్ మీడియాలో ఇందుకు సంబంధించిన ఓ వివాదాస్పద వీడియోను అస్సాం భాజపా పోస్టు చేసినట్టు గువాహటిలోని ఓ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

## చిన్నారుల మిస్సింగ్ కేసులు.. 'సుప్రీం' కీలక ఆదేశాలు

దిల్లీ: తప్పిపోయిన పిల్లల కేసుల విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా చిన్నారుల అదృశ్యం ఘటనల వెనుక ఏదైనా నెట్‌వర్క్ హస్తం ఉందా? రాష్ట్రస్థాయిలో ఏవైనా ముఠాలు పనిచేస్తున్నాయా? అనేది గుర్తించాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ ఘటనల వెనుక ఏదైనా వ్యవస్థీకృత ముఠా ఉందా?యాదృచ్ఛికంగా జరిగాయా? అనేది నిర్ధరించాలని సూచించింది. కిడ్నాపర్ల నుంచి రక్షించిన పిల్లలను ఇంటర్వ్యూ చేసి, వాటి వెనుక ఎటువంటి ముఠాలు



ఉన్నాయో తెలుసుకోవాలని పేర్కొంది. ఈమేరకు అన్ని రాష్ట్రాల నుంచి డేటాను సేకరించాలని చెప్పింది. రాష్ట్రాల్లో పిల్లల మిస్సింగ్, అక్రమ రవాణాపై 'గురియా స్వయం సేవి సంస్థాన్' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ ఆదేశాలు జారీ చేసింది. కాగా కొన్ని రాష్ట్రాలు తప్పిపోయిన పిల్లల సమాచారం ఇస్తున్నాయని.. మరికొన్ని రాష్ట్రాలు మాత్రం ఈ డేటాను పంచుకోవడానికి నిరాకరిస్తున్నాయని కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి న్యాయస్థానానికి తెలియజేశారు. దీనిపై సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ.. అవసరమైతే సమాచారాన్ని అందించని రాష్ట్రాల విషయంలో కఠిన ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేసింది. ఈ విషయంలో కేంద్రానికి సహకరించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ సమాచారాన్ని సేకరించడానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన అధికారిని నియమించాలని సూచించింది. అదృశ్యమైన పిల్లల కేసులను పర్యవేక్షించడానికి మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న పోర్టల్ లో అన్ని రాష్ట్రాల మిస్సింగ్ వివరాలను అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించింది.

## సీఎం పోస్టుకు డీకే.. హైకమాండ్‌కు 80 మంది ఎమ్మెల్యేల రిక్వెస్ట్

కర్ణాటకలో సీఎం పోస్టుపై ఎప్పటికప్పుడు ఊహాగానాలు వినిపిస్తూనే ఉన్నాయి. ఇప్పుడేమో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను సీఎం చేయమని 80 మంది ఎమ్మెల్యేలు హైకమాండ్‌కు అభ్యర్థన చేశారట. తాజాగా ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ వెల్లడించడం చర్చనీయాంశంగా మారింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. "సీఎం పదవి విషయంలో డీకేకు ఒక ఛాన్స్ ఇవ్వాలని 80-90 మంది ఎమ్మెల్యేలు హైకమాండ్‌ను అభ్యర్థించారు. ఇప్పుడు ఈ నిర్ణయం అధిష్ఠానం చేతుల్లోనే ఉంది. మాది క్రమశిక్షణ కలిగిన పార్టీ. దానికి తగ్గట్టే మేం ప్రవర్తించాలి. ఆయన (యతీంద్ర సిద్ధరామయ్య) తండ్రికి అనుకూలంగా పదేపదే మాట్లాడటం ఇబ్బందిగా ఉంది. కానీ



రాజకీయాల విషయానికి వస్తే.. క్రమశిక్షణే ముఖ్యం. తమ వ్యాఖ్యలతో ఇతరులను రెచ్చగొట్టాలని చూడటం సరికాదు. డీకేకు ఒక అవకాశం ఇవ్వాలని మా అందరి కోరిక. కానీ దానిగురించి బహిరంగంగా ప్రకటనలు చేసి, గందరగోళం సృష్టించకూడదు" అని ఇక్బాల్ మీడియాతో మాట్లాడారు. మరోవైపు, డీకే దిల్లీకి వెళ్తున్నారు. "కాంగ్రెస్ పార్టీ నేతలతో సమావేశం కానున్నాను. అయితే ఎవరిని కలుస్తాననే విషయం మాత్రం చెప్పలేను. మీరెందుకు అంత ఆసక్తి చూపిస్తున్నారు. నేను డిప్యూటీ సీఎం పదవితో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగానూ ఉన్నాను. దాంతో ఈ సమావేశాలు సర్వసాధారణమే. అలాగే కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ కానున్నాను" అని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు బదులిచ్చారు. ఎమ్మెల్యే ఇక్బాల్ వ్యాఖ్యల వేళ.. ఈ పర్యటన జరుగుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

## పుస్తకం అందుబాటులో ఉందని
# నరవణె పోస్ట్: రాహుల్ గాంధీ

భారత సైన్య మాజీ అధిపతి ఎం.ఎం.నరవణె రాసిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం ఇటీవల దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను రాసిన పుస్తకం సామాజిక మాధ్యమాల్లో అందుబాటులో ఉందంటూ నరవణె 2023లో పోస్ట్ చేశారని వెల్లడించారు. తన పుస్తకం సోషల్ మీడియాలో ఉందంటూ నరవణె 2023 డిసెంబర్‌లో ఎక్స్ (అప్పుడు ట్విట్టర్) వేదికగా లింక్ పోస్ట్ చేశారని రాహుల్ పేర్కొన్నారు. ఆ లింక్‌ను ఫాలో అవ్వగా.. ఓ ఆన్‌లైన్ స్టోర్‌లో పుస్తకం లభించిందన్నారు. తాను నరవణెనే నమ్ముతున్నానని రాహుల్ తెలిపారు. అయితే, ఈ బుక్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంపై ఇప్పటికే దిల్లీ పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే.

**తాజా పరిస్థితి ఇది..**


పుస్తకంపై నెలకొన్న తాజా పరిణామాలపై సైన్యం మాజీ అధిపతి జనరల్ ఎం.ఎం. నరవణె



స్పందించారు. నరవణె పుస్తకం ఒక్క కాపీ కూడా ఇంకా ప్రచురితం కాలేదని, అనధికారిక కాపీలు మాత్రమే ఉన్నాయని ప్రచురణ సంస్థ పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా చెప్పిన విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. పుస్తకం ప్రస్తుత స్థితి ఇది అంటూ పేర్కొన్నారు.

## నరవణె పుస్తకం.. ఒక్క కాపీ కూడా పబ్లిష్ కాలేదు

భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ ఎం.ఎం. నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంపై వివాదం కొనసాగుతోంది. ఈ బుక్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంపై ఇప్పటికే కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా స్పందించింది. నరవణె పుస్తకం ఒక్క కాపీ కూడా ఇంకా ప్రచురితం కాలేదని వెల్లడించింది. అనధికారిక కాపీలు మాత్రమే ప్రచారంలో ఉన్నాయని తెలిపింది. "నరవణె రాసిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ పుస్తకం ప్రచురణ హక్కులు కేవలం మాకు మాత్రమే ప్రత్యేకంగా ఉన్నాయి. ఈ బుక్‌ను ఇప్పటివరకు మేం ప్రింట్ చేయలేదు. డిజిటల్ ఫార్మాట్‌లోనూ అందుబాటులో లేదు. దీన్ని ఏ రూపంలోనూ మేం పంపిణీ చేయలేదు. బహిర్గతపర్చలేదు. ప్రస్తుతం ఈ బుక్ ప్రింట్, డిజిటల్, పీడీఎఫ్ రూపంలో పంపిణీలో ఉంటే గనుక.. అది పూర్తిగా మా సంస్థ కాపీరైట్ హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుంది. వాటిని వెంటనే స్వాధీనం చేసుకోవాలి. దీనిపై మేం న్యాయపరంగా చర్యలు తీసుకుంటున్నాం" అని పెంగ్విన్ స్పష్టం చేసింది. ఈ పుస్తకం సోషల్ మీడియా వేదికలు, ఆన్‌లైన్ వార్తాసంస్థల ద్వారా ప్రచారంలో ఉండటాన్ని తీవ్రంగా పరిగణించిన




దిల్లీ పోలీసులు సోమవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రచురణకు ముందు రూపొందించిన పీడీఎఫ్ ప్రతి కొన్ని వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉందని తెలిసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే పెంగ్విన్ సంస్థ దీనిపై స్పష్టతనిచ్చింది. చైనా దళాలతో భారత బలగాల ఘర్షణకు సంబంధించి వివాదాస్పద విషయాలను ప్రస్తావిస్తూ నరవణె రాసిన ఈ పుస్తకానికి రక్షణ మంత్రిత్వశాఖ నుంచి ప్రచురణ అనుమతి లభించలేదు. అయినప్పటికీ దీన్ని ఇటీవల ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లోక్‌సభకు తీసుకురావడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ పుస్తకాన్ని ప్రధానికి అందిస్తానంటూ రాహుల్ పేర్కొనడం సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించింది.



## అప్పుల ఊబిలో తెలుగు రాష్ట్రాల రైతులు..
# కేంద్రం అధికారిక ప్రకటన

రైతుల అప్పులపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కీలక ప్రకటన చేశారు. మంగళవారం లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. రైతులు అధిక అప్పులు తీసుకున్న రాష్ట్రాల జాబితాను వెల్లడించారు. మొదటి స్థానంలో ఆంధ్రప్రదేశ్, ఐదో స్థానంలో తెలంగాణ ఉన్నట్లు తెలిపారు. దేశంలోనే ఏపీ రైతులపై అధిక అప్పుల భారం ఉన్నట్లు చెప్పారు. జూలై 2018 నుంచి జూన్ 2019 మధ్య ఏపీ రైతు సగటు అప్పు రూ.2,35,554, తెలంగాణ రైతు సగటు అప్పు రూ.1,52,113 ఉన్నట్లు స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే.. దేశ ఆర్థిక వ్యవస్థకు మూలం గ్రామీణ, వ్యవసాయ రంగాలే. 1991 తర్వాత చేపడుతున్న ఆర్థిక సంస్కరణలు ఇండియాను ప్రపంచంలోనే ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మలిచినా, వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతుండటంతో దేశంలో ఉపాధి అవకాశాలు మెరుగు పడటం లేదు. మరోవైపు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. రుణమాఫీ, MSP వంటి ఉపశమన చర్యలు సమస్య మూల కారణాలను పరిష్కరించలేకపోతున్నాయి.

## ఇటలీలో హాలీవుడ్ సినిమా స్థాయిలో దొంగతనం!
# దేశం ప్లాన్ రివర్స్ కావడంతో పరార్!

ఇటలీ దేశంలో హాలీవుడ్ సినిమా స్థాయిలో దోపిడీ చేసేందుకు ప్రయత్నించిన ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పుగ్లియా ప్రాంతంలో సోమవారం ఉదయం దోపిడీ ప్రయత్నం కలకలం రేపింది. కోట్లాది రూపాయల (యూరోల) డబ్బును తరలిస్తున్న వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని 10 మంది ముసుగు ధరించిన సాయుధ ముఠా మెరుపు దాడికి దిగింది. అయితే, నగదు వాహనంలోని అత్యాధునిక 'ఫోమ్ సెక్యూరిటీ సిస్టమ్' దొంగలకు చుక్కలు చూపించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రిండిసి, లెచే పట్టణాల మధ్య ఉన్న SS613 హైవేపై ఉదయం 8 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. 'బాటిస్టోల్లి గ్రూప్'కు చెందిన వారు డబ్బులు తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకోవడానికి దొంగలు పక్కా స్కెచ్ వేశారు.

**పోలీసుల వేషధారణలో..**

ముందుగా హైవేపై ముఠా సభ్యులు పోలీసుల వేషధారణలో వచ్చి, నీలిరంగు లైట్లను ఉపయోగించి వాహనాన్ని ఆపారు. తప్పించుకునే మార్గాలను మూసివేయడానికి రోడ్డుపై కారును తగులబెట్టి తప్పించుకోకుండా 'నిప్పుల గోడ'గా ఏర్పాటు చేశారు. వాహనాన్ని నిలిపిన వెంటనే హైవేపై ప్రయాణిస్తున్న వారిని భయభ్రాంతులకు గురి చేస్తూ ఏకే47 తుపాకులతో గాల్లోకి కాల్పులు జరిపారు.

*** పేలుడు ధాటికి ఎగిరిన వాహనం..**

**కానీ!**

ఇక, నగదు వాహనాన్ని బద్దలు కొట్టడానికి దొంగలు శక్తివంతమైన పేలుడు పదార్థాలను వాడారు. ఆ పేలుడు ధాటికి భారీ వాహనం ఒక్కసారిగా గాల్లోకి లేచి పడింది. ఇక నగదును తీసుకెళ్లడమే అనుకున్న సమయంలో.. వాహనంలోని ఆటోమేటెడ్ ఫోమ్ సెక్యూరిటీ సిస్టమ్ యాక్టివేట్ అయింది. సెకన్ల వ్యవధిలో డబ్బులు ఉన్న గది మొత్తం గట్టిపడే ఫోమ్‌తో నిండిపోయింది. దీంతో నగదు దొంగలకి చిక్కకుండా ఒక రక్షణ కవచంలా మారిపోయింది. ఈ తతంగం అంతా వాహనదారుల కండ్ల ముందే జరిగింది.

# లాభాల హ్యాట్రిక్

వరుసగా మూడో రోజు లాభాల్లో మార్కెట్లు


వరుసగా మూడో రోజు లాభాల్లో ముగిసిన దేశీయ సూచీలు

208 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్, 67 పాయింట్లు లాభపడ్డ నిఫ్టీ

కొన్ని కంపెనీల మెరుగైన క్యూ3 ఫలితాలతో మార్కెట్లకు మద్దతు

ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్ మినహా అన్ని రంగాల సూచీలు లాభం

డాలర్‌తో పోలిస్తే బలపడిన భారత రూపాయి



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు కూడా లాభాలతో ముగిశాయి. మంగళవారం నాటి ట్రేడింగ్‌లో కొన్ని కంపెనీల మూడో త్రైమాసిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో సూచీలు లాభపడ్డాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 208 పాయింట్లు లాభపడి 84,065 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 67 పాయింట్లు పెరిగి 25,935 వద్ద ముగిసింది.

ప్రధాన సూచీలతో పోలిస్తే బ్రాడర్ మార్కెట్లు మెరుగ్గా రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.49 శాతం, ఎన్ఎస్ఈ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.38 శాతం చొప్పున లాభపడ్డాయి. ముఖ్యంగా, మైక్రోక్యాప్ కంపెనీల షేర్లకు మంచి డిమాండ్ కనిపించింది. డిసెంబర్ త్రైమాసికంలో బలమైన ఫలితాల నేపథ్యంలో నిఫ్టీ మైక్రోక్యాప్ 250 సూచీ ఏకంగా 1 శాతం పెరిగింది. విదేశీ సంస్థాగత మదుపర్లు కొనుగోళ్లు కొనసాగించడం, సానుకూల అంతర్జాతీయ సంకేతాలు, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై నెలకొన్న ఆశలు మార్కెట్ సెంటిమెంట్‌కు మద్దతునిచ్చాయి. ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్ మినహా అన్ని రంగాల సూచీలు లాభాల్లోనే ట్రేడ్ అయ్యాయి. నిఫ్టీ మీడియా 2.40 శాతంతో అత్యధికంగా లాభపడగా, నిఫ్టీ ఆటో 1.37 శాతం పెరిగింది. మంగళవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.23 శాతం బలపడి 90.52 వద్ద ముగిసింది. అయితే, నిఫ్టీ బ్యాంక్ సూచీ మాత్రం 42.95 పాయింట్లు స్వల్పంగా నష్టపోయి 60,626.40 వద్ద స్థిరపడింది. మార్కెట్ నిపుణుల ప్రకారం, నిఫ్టీకి తక్షణ మద్దతు 25,550-25,600 స్థాయిల వద్ద ఉంది.

## పాకిస్థాన్‌లో తీవ్ర ఉద్యోగ సంక్షోభం..

21 ఏళ్ల గరిష్ఠానికి నిరుద్యోగం!

ఆర్థిక స్థిరత్వం సాధించామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో భిన్నమైన పరిస్థితి

పాక్ పదేళ్లలో 3 కోట్ల ఉద్యోగాలు సృష్టించాల్సి ఉంటుందన్న ప్రపంచ బ్యాంకు

ఉపాధి లేక దేశం విడిచి వెళుతున్న నిపుణులు, డాక్టర్లు

ప్రైవేటు రంగం కూడా కుదేలు.. మూతపడుతున్న పరిశ్రమలు



**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ ప్రభుత్వం తాము దేశంలో ఆర్థిక స్థిరత్వం సాధించామని గొప్పగా చెప్పుకుంటున్నప్పటికీ, క్షేత్రస్థాయి వాస్తవాలు పూర్తి భిన్నంగా ఉన్నాయి. దేశంలో నిరుద్యోగం తీవ్రస్థాయికి చేరింది. లక్షలాది మంది పాకిస్థానీలకు ప్రభుత్వం చెబుతున్న 'ఆర్థిక స్థిరత్వం' అనేది ఉపాధినివ్వని ఓ పనికిరాని మాటగానే మిగిలిపోయిందని పాకిస్థానీ మీడియా కథనం ఒకటి వెల్లడించింది.

2025 లేబర్ ఫోర్స్ సర్వే భయంకరమైన వాస్తవాలను బయటపెట్టింది. దేశంలో నిరుద్యోగిత రేటు 7.1 శాతానికి పెరిగింది. ఇది గడిచిన 21 ఏళ్లలో అత్యధికం. ఈ గణాంకాలు ప్రభుత్వ విజయవాదానికి కళ్లెం వేస్తున్నప్పటికీ, అధికారిక ప్రకటనల్లో దీని ప్రస్తావనే లేకుండా పోయింది. ఉద్యోగాలు దొరక్క ప్రజలు పడుతున్న ఇబ్బందులు, నిత్యావసరాలు తగ్గించుకుంటున్న కుటుంబాలు, అవకాశాల్లేక ఆశలు కోల్పోతున్న యువత రూపంలో ఈ సంక్షోభం ప్రతిరోజూ కనిపిస్తూనే ఉంది.

## పాన్ కార్డు నిబంధనల్లో భారీ మార్పులు..

ఏప్రిల్ 1 నుంచి కొత్త రూల్స్!

ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025 అమలు

పాన్ కార్డు వినియోగ నిబంధనల్లో కీలక మార్పులకు ప్రతిపాదన

బ్యాంకు డిపాజిట్లు, ఆస్తుల కొనుగోళ్లపై మారిన లావాదేవీల పరిమితులు

హోటల్ బిల్లులు, వాహనాల కొనుగోలుకు కొత్త పాన్ రూల్స్

ఫిబ్రవరి 22 వరకు ముసాయిదాపై అభిప్రాయాల స్వీకరణ




న్యూఢిల్లీ: దేశంలో పన్నుల వ్యవస్థను మరింత సరళతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. దాదాపు ఆరు దశాబ్దాల నాటి 1961 ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కొత్త ఆదాయపు పన్ను చట్టం-2025ను తీసుకువస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ఈ కొత్త చట్టం 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. ఇందులో భాగంగా పన్ను చెల్లింపుదారుల సౌలభ్యం కోసం పలు నిబంధనలను సులభతరం చేశారు. ముఖ్యంగా పాన్ కార్డు వినియోగానికి సంబంధించిన లావాదేవీల పరిమితుల్లో గణనీయమైన మార్పులు ప్రతిపాదించారు.

ఈ కొత్త చట్టానికి సంబంధించిన ముసాయిదా నిబంధనలను ఆదాయపు పన్ను శాఖ ఇప్పటికే విడుదల చేసింది. వీటిపై ప్రజలు, నిపుణుల నుంచి ఈ నెల 22 వరకు అభిప్రాయాలను స్వీకరించనుంది. అనంతరం తుది నిబంధనలను, ఐటీ ఫారాలను ప్రభుత్వం అధికారికంగా నోటిఫై చేస్తుంది. ఈ ముసాయిదా ప్రకారం పలు ఆర్థిక లావాదేవీలకు పాన్ కార్డు తప్పనిసరి చేసే పరిమితులను సవరించారు.

కొత్తగా మారనున్న పాన్ నిబంధనలు ఇవే..

బ్యాంకు లావాదేవీలు: ప్రస్తుతం బ్యాంకులో ఒక్కసారి రూ. 50,000కు మించి నగదు డిపాజిట్ చేస్తే పాన్ వివరాలు ఇవ్వాల్సి ఉంది. కొత్త నిబంధనల ప్రకారం, ఒకటి లేదా అంతకంటే ఎక్కువ బ్యాంకు ఖాతాల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ. 10 లక్షలు, అంతకుమించి మించి నగదు డిపాజిట్ చేసినప్పుడు లేదా విత్‌డ్రా చేసినప్పుడు మాత్రమే పాన్ కార్డు వివరాలు సమర్పించాలి.

# ఓపెనర్లే కొట్టేశారు..



పది వికెట్లతో యూఏఈని ఓడించిన న్యూజిలాండ్..!

**న్యూఢిల్లీ:** వరల్డ్‌కప్ సన్నాహక సిరీస్‌లో భారత జట్టు చేతిలో చావుదెబ్బ తిన్న న్యూజిలాండ్ మెగా టోర్నీలో జూలు విదుల్చుతోంది. తొలిపోరులో అఫ్గనిస్థాన్ స్పిన్ ఉచ్చును ఛేదించిన కివీస్.. ఈసారి యూఏఈ భరతం పట్టింది. 174 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ ఓపెనర్లు ఓపెనర్లు టిమ్ సీఫర్ట్(89 నాటౌట్), ఫిన్ అలెన్(84 నాటౌట్) మంచుముక్కలా కరిగించారు. హైలెట్స్ చూస్తున్నామా? అన్నట్టుగా రెండో ఓవర్ నుంచి దూకుడే మంత్రగా యూఏఈ బౌలర్లపై ఈ ద్వయం విరుచుకుపడింది. అర్ధ శతకాల అనంతరం మరింత రెచ్చిపోయిన సీఫర్ట్, అలెన్ ప్రత్యర్థి బౌలర్లపై జాలి, దయ లేకుండా ఆడడంతో మరో26 బంతులు మిగిలి ఉండగానే మట్టికరిపించింది.

టీ20 ప్రపంచకప్‌లో సంచలనం సృష్టించాలనుకున్న యూఏఈ కలలు కల్లలయ్యాయి. పటిష్టమైన న్యూజిలాండ్‌పై భారీ స్కోర్‌తో విజయంపై ఆశలు పెట్టుకున్న ఆ జట్టుపై ఓపెనర్లు టిమ్ సీఫర్ట్(89 నాటౌట్), ఫిన్ అలెన్(84 నాటౌట్) పిడుగుల్లే విరుచుకుపడ్డారు. 174 పరుగుల ఛేదనలో నువ్వానేనా అనట్టు ఇద్దరూ పోటీపడి బౌండరీల పండుగ చేసుకున్నారు. రోహిద్ ఖాన్ వేసిన 6వ ఓవర్లో సీఫర్ట్ 3 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 20 రన్స్ రాబట్టగా.. పవర్ ప్లేలోనే 80కి చేరువైంది కివీస్.

ఈ జోడీని విడదీసేందుకు యూఏఈ సారథి వసీం బౌలర్లను మార్చినా ఫలితం లేకపోయింది. స్వీప్ షాట్లు, ఫ్లిక్స్, కట్ షాట్లతో అలరించిన సీఫర్ట్, అలెన్ ఏ దశలోనూ ఔటయ్యేలా కనిపించలేదు. దాంతో.. చూస్తుండగానే లక్ష్యం చిన్నదైపోయింది. రోహిద్ వేసిన 16 వ ఓవర్ రెండో బంతిని సీఫర్ట్ సిక్సర్‌గా మలవగా బ్లాక్ క్యాప్స్ 10 వికెట్లతో జయభేరి మోగించింది. వరుసగారెండో విజయంతో మిచెల్ శాంట్నర్ బృందం గ్రూప్ డీలో అగ్రస్థానానికి ఎగబాకింది.

### వసీం, షరాఫు దంచేయగా..

చెన్నైలో పటిష్టమైన న్యూజిలాండ్‌కు మొదట యూఏఈ బ్యాటర్లు చుక్కలు చూపించారు. ఓపెనర్ ముహమ్మద్ వసీం(64 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అదరగొట్టగా.. అలీషన్ షరాఫు(55) హాఫ్ సెంచరీతోచెలరేగాడు. కివీస్ పేస్, స్పిన్ దళాన్ని ఉతికారేసిన ఈ ద్వయం విధ్వంసంతో 15 ఓవర్లకే స్కోర్ 120 దాటింది. ఆఖర్లో మయాంక్ కుమార్(21) దంచేశాడు. చివరి ఓవర్లో మరిన్ని పరుగులు రాబట్టాలనుకున్న ప్రత్యర్థికి షాకిస్తూ మ్యాట్ హెన్రీ రెండు వికెట్లు తీశాడు. వరుసగా రెండు వికెట్లు పడడంతో యూఏఈ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది.

## వరల్డ్‌కప్ హీరోకు సచిన్ అపురూపమైన కానుక..

**న్యూఢిల్లీ:** అండర్ -19 వరల్డ్‌కప్ హీరోలపై ప్రశంసల జల్లు కురుస్తోంది. జగజ్జేతలుగా స్వదేశం తిరిగొచ్చిన భారత బృందాన్ని దిగ్గజ ఆటగాళ్లు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ తాజాగా కెప్టెన్ ఆయుశ్ మాత్రేకు అపురూపమైన కానుక అందించాడు. భారత్‌ను అజేయంగా నడిపించి విశ్వ విజేతగా నిలిపినందుకు అతడికి తన టెస్టు జెర్సీని బహూకరించాడు. లెజెండరీ ఆటగాడి నుంచి విలువైన బహుమతి అందుకున్న మాత్రే సంతోషం వ్యక్తం చేస్తూ పోస్ట్ పెట్టాడు.

ప్రతిభావంతులను ప్రోత్సహించడంలో ముందుండే సచిన్ టెండూల్కర్ ఈసారి అండర్ -19 వరల్డ్‌కప్ కెప్టెన్ ఆయుశ్ మాత్రేను ఆకాశానికెత్తేశాడు. భారత జట్టుకు ఆరో కప్‌ను సాధించిన అతడిని ప్రశంసించిన సచిన్.. అతడికి మర్చిపోలేని బహూకరించాడు. మంగళవారం ముంబైలోని తన నివాసంలో మాత్రేను అభినందించిన క్రికెట్ దిగ్గజం.. డియర్ ఆయుశ్.. నీ కెరీర్ విజయవంతంగా సాగాలని కోరుకుంటున్నా అని రాసున్న టెస్టు జెర్సీని కానుకగా ఇచ్చాడు. ఇలానే కష్టపడుతూ ఉండు. జనాల కామెంట్లను పట్టించుకోకు. ఎన్ని అవరోధాలు ఎదురైనా ప్రాక్టీస్ మానేయకు. ఆట మీద శ్రద్ధతో ఉండాలి అని యువ క్రికెటర్‌కు సచిన్ విలువైన సూచలనలు చేశాడు.




చిన్నప్పటి నుంచి సచిన్ ఆటను చూస్తూ పెరిగిన ఆయుశ్.. అతడి నుంచి నుంచి విలువైన కానుక అందుకోవడంతో సంతోషంలో మునిగి తేలుతున్నాడు. తన సంతోషాన్ని పంచుకున్నాడు. 'చిన్నప్పటి నుంచి మిమ్మల్ని టీవీ స్క్రీన్‌లో చూస్తూ పెరిగాను. ఈరోజు నేను మీ ఇంట్లో ఉన్నాను. మీ క్రికెట్ ప్రయాణంలో భాగమైన అపురూపమైన కానుక ఇప్పుడు నా చేతుల్లో ఉంది. నాకు ఈ గౌరవం కల్పించినందుకు ధన్యవాదాలు సార్. భారత క్రికెట్‌కు ఏళ్లుగా మీరు ఎలాగైతే సేవలందించారో.. నేను కూడా అదే గౌరవాన్ని కొనసాగిస్తాను' అని మాత్రే తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో పేర్కొన్నాడు.

## శ్రీలంకకు ఊహించని ఎదురుదెబ్బ..

వరల్డ్‌కప్ నుంచి స్టార్ ఆల్‌రౌండర్ ఔట్..!

**శ్రీలంక:** స్వదేశంలో జరగుతున్న ప్రపంచకప్‌లో ఆతిథ్య శ్రీలంక మరో షాక్. తొలి విజయంతో జోరుమీదున్న ఆ జట్టు వనిందు హసరంగ సేవల్ని కోల్పోనుంది. గాయం కారణంగా ఈ సీనియర్ ఆల్‌రౌండర్ మెగా టోర్నీ నుంచి వైదొలగడమే అందుకు కారణం. తొలి మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై మూడు వికెట్లతో మెరిసిన హసరంగ అనూహ్యంగా గాయంతో ఇబ్బంది పడ్డాడు. వైద్య పరీక్షల అనంతరం అతడికి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. దాంతో.. ఈ మ్యాచ్ విన్నర్ అందుబాటులో ఉండడు.

ప్రపంచకప్ వంటి మెగా టోర్నీల్లో ఏ జట్టైనా తమ ప్రధాన అస్త్రాలను నమ్ముకుంటుంది. కానీ, శ్రీలంకకు మాత్రం ఈసారి ఆ అవకాశం కోల్పోయింది. ఇప్పటికే పేసర్ ఇషాన్ మలింగ గాయంతో దూరమవ్వగా.. ఇప్పుడు ఆల్‌రౌండర్ హసరంగ సైతం వరల్డ్‌కప్ నుంచి నిష్క్రమించాడు. ఇటీవల కాలంలో గాయాలతో సతమతమవుతూ జట్టుకు దూరమైన వనిందు హసరంగ ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో ఎడమ కాలి కండరాల నొప్పితో ఇబ్బందిపడ్డాడు.

ఫిజియో వచ్చి పరీక్షించాక ఓవర్ పూర్తి చేసిన అతడు.. వికెట్ తీసి డగౌట్‌కు వెళ్లాడు. కాసేపటికి తిరిగొచ్చిన హసరంగ మరో వికెట్ తీసి లంక విజయంలో కీలకమయ్యాడు. కానీ, మ్యాచ్ అనంతరం ఎంఆర్ఐ స్కానింగ్‌లో అతడికి ఎడమ కాలి కండరంలో చీలక వచ్చినట్టు




గుర్తించారు. దాంతో.. వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అలా ఈ స్టార్ ఆల్‌రౌండర్ మెగా టోర్నీకి దూరం కావాల్సి వచ్చింది. అతడి స్థానంలో దుషాన్ హేమంత స్క్వాడ్‌లోకి రానున్నాడు.

### మూడేసి వికెట్లతో చెలరేగగా

పొట్టి ప్రపంచకప్‌లో శ్రీలంక అదిరే బోణీ కొట్టింది. తొలి లీగ్ మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై కుశాల్ పెరీరా(56 నాటౌట్ ), కమిందు మెండిస్(44) మెరుపులతో భారీ స్కోర్ చేసిన లంక.. ప్రత్యర్థిని 143కే ఆలౌట్ చేసింది. హ్యారీ టెక్టర్(40) పోరాడినా.. సమచరుల నుంచి మద్దతు కరువైంది. హసరంగ(3-25), థీక్షణ(3-23), పతిరణ(3-25)లు మూడేసి వికెట్లతో చెలరేగగా లంక 20 పరుగుల తేడాతో గెలిచి రెండు పాయింట్లు సొంతం చేసుకుంది.

# టీ20 వరల్డ్ కప్: కూనల పోరులో నెదర్లాండ్స్ గెలుపు

టీ20 ప్రపంచకప్‌లో నమీబియాపై నెదర్లాండ్స్ 7 వికెట్ల తేడాతో విజయం


బంతితో రెండు వికెట్లు తీసి, బ్యాటింగ్‌లో అజేయంగా 72 పరుగులు చేసిన బాస్ డి లీడ్

ముందుగా బ్యాటింగ్ చేసిన నమీబియా 20 ఓవర్లలో 156/8 స్కోరుకే పరిమితం

18 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి రికార్డు విజయాన్ని అందుకున్న డచ్ జట్టు

గురువారం డిఫెండింగ్ ఛాంపియన్ భారత్‌తో తలపడనున్న నమీబియా

**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచకప్ 2026లో నెదర్లాండ్స్ జట్టు అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఆల్‌రౌండర్ బాస్ డి లీడ్ బంతితో, బ్యాట్‌తో చెలరేగడంతో మంగళవారం నాడు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన గ్రూప్-ఎ మ్యాచ్‌లో




నమీబియాపై 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ గెలుపుతో డచ్ జట్టు టోర్నీలో బోణీ కొట్టింది.

ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నమీబియా, నెదర్లాండ్స్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ ముందు తడబడింది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 156 పరుగులు మాత్రమే చేయగలిగింది. జాన్ నికోల్ లాఫ్టీ-ఈటన్ (42) టాప్ స్కోరర్‌గా నిలిచినా, ఇతర బ్యాటర్లు మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మార్చడంలో విఫలమయ్యారు. నెదర్లాండ్స్ బౌలర్లలో బాస్ డి లీడ్, లోగాన్ వాన్ బీక్ చెరో రెండు వికెట్లు పడగొట్టి నమీబియాను కట్టడి చేశారు.

అనంతరం 157 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నెదర్లాండ్స్‌ను బాస్ డి లీడ్ ఒంటిచేత్తో గెలిపించాడు. కేవలం 48 బంతుల్లో 5 ఫోర్లు, 4 భారీ సిక్సర్లతో అజేయంగా 72 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కోలిన్ అకెర్‌మాన్ (32)తో కలిసి మూడో వికెట్‌కు 70 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. చివర్లో కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ (18 నాటౌట్) వేగంగా ఆడటంతో నెదర్లాండ్స్ మరో రెండు ఓవర్లు మిగిలి ఉండగానే, 18 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

టీ20 ప్రపంచకప్ చరిత్రలో వికెట్ల పరంగా నెదర్లాండ్స్‌కు ఇదే అతిపెద్ద విజయం కావడం విశేషం. మరోవైపు, నమీబియా తన తదుపరి మ్యాచ్‌లో గురువారం ఇదే వేదికపై డిఫెండింగ్ ఛాంపియన్ భారత్‌తో తలపడనుంది.





# ఒక్క సినిమా రిలీజ్ కాలేదు..

అప్పుడే ఆఫర్స్ పట్టేస్తోన్న హీరోయిన్..

టాకీస్: ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా సినీరంగంలోకి అడుగుపెట్టి వరుస అవకాశాలు అందుకుంటున్న తారలు చాలా మంది ఉన్నారు. ఇప్పుడు ఓ అమ్మడు సోషల్ మీడియా ద్వారా చాలా ఫేమస్ అయ్యింది. ఇక తన ఇన్ స్టా రీల్స్ ద్వారానే ఏకంగా పాన్ ఇండియా స్టార్ సరసన ఛాన్స్ కొట్టేసింది. ఇన్ స్టా రీల్స్ ద్వారా పాపులర్ అయ్యింది. దీంతో ఏకంగా పాన్ ఇండియా స్టార్ సరసన ఛాన్స్ కొట్టేసింది. మొదటి సినిమా ఇంకా విడుదల కాలేదు. అప్పుడే వరుస అవకాశాలు అందుకుంటూ టాలీవుడ్ ఇండస్ట్రీలో బిజీ హీరోయిన్ అయ్యింది ఈ ముద్దుగుమ్మ. ఆమె మరెవరో కాదండి.. హీరోయిన్ ఇమాన్వి. డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న ఫౌజీ మూవీ హీరోయిన్. ఈ సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయ్యేందుకు ఎదురుచూస్తుంది ఇమాన్వి. కొన్ని రోజులుగా ఈ మూవీ షూటింగ్ జరుగుతుంది. కథానాయికగా ఇమాన్వికి ఇదే మొదటి సినిమా. అంతకు ముందు ఆమె సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్. నెట్టింట పాపులర్ అయిన ఈ ముద్దుగుమ్మ ఏకంగా ప్రభాస్ జోడిగా సెలక్ట్ చేశారు డైరెక్టర్ హను రాఘవపూడి. తాజాగా ఈ ముద్దుగుమ్మ మరో ఛాన్స్ కొట్టేసిందట. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా డైరెక్టర్ సురేందర్ రెడ్డి ఓ సినిమా చేయనున్నారు. ఈ ఏడాది ఉగాది సందర్భంగా ఈ మూవీని అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ సినిమాలో కథానాయికగా ఇమాన్విని ఎంపిక చేసినట్లుగా ప్రచారం జరుగుతుంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన రానున్నట్లు తెలుస్తోంది. ఒక్క సినిమా విడుదల కాకముందే ఆమెకు వరుసగా అవకాశాలు తలుపుతట్టినట్లు తెలుస్తోంది.

# సెన్సార్ పూర్తి చేసుకున్న 'ఫంకీ'

టాకీస్: మాస్ కా దాస్ విశ్వక్ సేన్, 'జాతిరత్నాలు' ఫేమ్ అనుదీప్ కేవీ కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ ఎంటర్టైనర్ 'ఫంకీ' ఫిబ్రవరి 13న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కాబోతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే చిత్రబృందం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని U/A సర్టిఫికేట్‌ను పొందింది, అలాగే దీని రన్ టైమ్ 128 నిమిషాలుగా ఖరారు కావడంతో మేకర్స్ దీనిని 'అన్ లిమిటెడ్ అబ్సర్డ్ ఫన్' ప్యాకేజీగా ప్రమోట్ చేస్తున్నారు. ఇండస్ట్రీ నేపథ్యంలో సాగే సెటైరికల్ కామెడీగా తెరకెక్కిన ఈ సినిమాలో విశ్వక్ సేన్ ఒక ఫిల్మ్ డైరెక్టర్‌గా కనిపిస్తుండగా, కయాడు లోహర్ కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే విడుదలైన 'యమ యమ్మ' సాంగ్ మరియు ఫన్నీ ట్రైలర్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేశాయి. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ 4 సినిమాస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించాయి. వాలెంటైన్స్ వీకెండ్ కానుకగా వస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులకు ఫుల్ లెంగ్త్ కామెడీ రైడ్‌ను అందిస్తుందని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది.

## సెంగోల్ చరిత్ర ఆధారంగా నిఖిల్ 'స్వయంభూ'



టాకీస్: యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న భారీ పీరియాడిక్ చిత్రం 'స్వయంభూ'. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా కథాంశానికి సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయాన్ని నిఖిల్ పంచుకున్నారు. ఈ సినిమా కథ న్యాయబద్ధమైన పాలనకు ప్రతీకగా నిలిచే 'సెంగోల్' (రాజదండం) చారిత్రక నేపథ్యం ఆధారంగా సాగుతుందని ఆయన వెల్లడించారు.

ఈ సందర్భంగా నిఖిల్ మాట్లాడుతూ, "భారత చరిత్రలోని ఓ ప్రత్యేకమైన అంశం అయిన సెంగోల్ చరిత్ర నుంచి స్ఫూర్తి పొంది 'స్వయంభూ' కథను రూపొందించాం. కొత్త పార్లమెంట్ భవన ప్రారంభోత్సవం సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ చేతిలో కనిపించిన సెంగోల్ గురించి అందరికీ తెలుసు. కానీ దాని వెనుక ఘనమైన చరిత్ర ఉంది" అని తెలిపారు.

"ఈ సెంగోల్‌ను తొలుత శ్రీరాముడు తన వారసులకు అందించారు. ఇది న్యాయమైన పాలనకు, శక్తికి చిహ్నం. ఆ తర్వాత చోళుల వంటి గొప్ప సామ్రాజ్యాల కాలంలోనూ ఈ సెంగోల్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంది. మేం ఈ చారిత్రక అంశం చుట్టూ ఒక కల్పిత కథను సృష్టించాం" అని నిఖిల్ వివరించారు. పురాణం, చరిత్ర, కల్పనల మేళవింపుతో ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది.

భారతదేశ గొప్ప చరిత్రకు నివాళిగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ సినిమా టీజర్‌ను ఫిబ్రవరి 11న రెండు నగరాల్లో ఏకకాలంలో పాన్-ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు.




## వారణాసిలో ప్రియాంక పాత్ర

ఎస్.ఎస్ రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా నటిస్తోన్న చిత్రం 'వారణాసి'లో ప్రియాంక చోప్రా.. మందాకిని అనే ప్రధాన పాత్రలో కనిపించనున్న విషయం తెలిసిందే. ప్రియాంక ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం పై ఆమె భర్త నిక్ జోనస్ మొదటిసారి స్పందించారు. ఈ సినిమా గురించి ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. తను 14 నెలల నుంచి ఓ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉంది. 'ఆర్ఆర్ఆర్' లాంటి గొప్ప చిత్రాన్ని రూపొందించిన రాజమౌళి దీన్ని రూపొందిస్తున్నారు. ఆయన నుంచి వస్తోన్న మరో భారీ చిత్రమిది. అద్భుతంగా ఉండనుందని నమ్ముతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిక్ భారతీయ చిత్రాల గురించి మాట్లాడారు. తనకు ఇండియన్ సినిమాలు అంటే ఎంతో ఇష్టమన్నారు. గొప్ప చిత్రాలు ఉన్నాయని కొనియాడారు. భారతీయ సంగీతమన్నా అభిమానమన్నారు. భారత్‌లో ఉమ్మడి కుటుంబవ్యవస్థ ఉందని అది తనకు చాలా ఇష్టమన్నారు. ఏదైనా వేడుక జరిగినప్పుడు అందరూ కలిసి సరదాగా ఉంటారని తెలిపారు. 'వారణాసి' విషయానికొస్తే.. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు.

## యాక్టర్ కమ్ డైరెక్టర్ రవిబాబు సర్‌ప్రైజ్..

టాకీస్: నటుడిగా, నిర్మాతగా, డైరెక్టర్‌గా జర్నీ కొనసాగిస్తున్న రవిబాబు గురించి తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేదు. టాలీవుడ్‌లో ఉన్న మల్టీ టాలెంటెడ్ సీనియర్ యాక్టర్లలో ఒకరు రవి బాబు. లాంగ్ గ్యాప్ తర్వాత రవిబాబు డైరెక్టర్ కమ్ యాక్టర్‌గా ఆడియెన్స్ ముందుకు రాబోతున్నాడు.

రవిబాబు స్వీయ దర్శకత్వంలో నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ ఖీజీళినీతీ. మేకర్స్ ఈ మూవీ అనౌన్స్‌మెంట్ వీడియోను షేర్ చేశారు. అనౌన్స్‌మెంట్ వీడియోలో రవి బాబు యాక్షన్ అవతార్‌లో కనిపిస్తున్న విజువల్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. ఫ్లైయింగ్ ఫ్రాగ్స్, సురేశ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీ షూటింగ్ మొత్తం పూర్తయినట్టు ప్రకటించారు.




అంతేకాదు ఈ చిత్రాన్ని 2026 మేలో సినిమాను విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. ఈ చిత్రంలో రవిబాబు లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలో క్లారిటీ రానుంది. రవిబాబు చివరగా ఆర్‌పీ పట్నాయక్ డైరెక్షన్‌లో వచ్చిన కాఫీ విత్ ఏ కిల్లర్ సినిమాలో వన్ ఆఫ్ ది కీ రోల్‌లో నటించాడు. డైరెక్టర్‌గా 2021లో క్రష్ సినిమా తెరకెక్కించాడు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.